మనం

జనం కోసం అక్షర యజ్ఞం...

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 3 • సంచిక: 39 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | శుక్రవారం • 18-1-2019 | www.manamnews.com | /manamnews



డ్రైవరు లేని సోలార్ బస్సు!

విద్యార్థుల అద్భుత సృష్టి



సైన్యంలోకి తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు

రూపొందించిన హెచ్ఏఎల్

7



భారతీయులకు కీలక పదవులు

నలుగురికి పదవులు కట్టబెట్టిన ట్రంప్

ఇంటెలిజెన్స్ కాంగ్రెషనల్ సభ్యుడిగా రాజా కృష్ణమూర్తి

జాతీయ భద్రత విభాగంలో తొలి దక్షిణాసియా వ్యక్తి



జ్ఞానానికి చిరునామా

రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మహర్దశ

- ఎక్స్ఎల్ఆర్ఐ క్యాంపస్‌కు శంకుస్థాపన
- ఎనిమిది నెలల్లో నిర్మాణ పనులు పూర్తి..
- ఇంటర్నేషనల్ స్కూలుకు 8 ఎకరాలు
- టాప్-20 విద్యాసంస్థల్లో 10 ఇక్కడే
- నాలెడ్జిపై పెట్టుబడితో మంచి ఫలితం
- ఉద్యోగాలకు ప్రపంచమే ఇటు వస్తుంది
- ఎవరు అడ్డుకున్నా రాష్ట్రాభివృద్ధి ఆగదు
- ఈనెల 29న కియా మోటార్స్ తొలికారు
- రాజధాని మొత్తానికి ఒకటే ఏసీ యూనిట్
- దాన్నుంచే ఇళ్లకూ సరఫరా చేసే అవకాశం
- సీఎం చంద్రబాబు నాయుడు సూచన



అమరావతి, జనవరి 17:

భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజ్ఞానానికి చిరునామాగా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలోని ఐనవోలు వద్ద గురువారం మధ్యాహ్నం దేశంలోని అగ్రశ్రేణి బి-స్కూల్స్‌లో ఒకటైన జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్- ..మిగతా 2లో

శాంతి దూతలు వీరే!

2015-18 గాంధీ శాంతి బహుమతులు



- నాలుగేళ్లకు కలిపి ఒకేసారి ప్రకటన
- 2015కు.. వివేకానంద కేంద్రం
- 2016కు.. అక్షయపాత్ర, సులభ్
- 2017కు.. ఎకాయ్ అభియాన్ ట్రస్టు
- 2018కి.. యొహై ససకవాకు అవార్డు



న్యూఢిల్లీ, జనవరి 17:

గాంధీ శాంతి బహుమతుల విజేతల వివరాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. చిట్ట చివరిగా 2014లో ఇస్రోకు దక్కిన ఈ పురస్కారాన్ని.. ఆ తర్వాతి నుంచి ఎవ రికీ ఇవ్వలేదు. ఇప్పుడు 2015 నుంచి 2018 వరకు నాలుగేళ్లకు కలిపి ఒకేసారి ప్రకటించారు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ మార్పునకు అహింసాయుత, గాంధేయ పద్ధతులలో కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ఈ బహుమతి ఇస్తారు. 2015 సంవత్సరానికి గ్రామీణాభివృద్ధి, విద్యారంగాల్లో కృషిచేసిన కన్యా కుమారిలోని వివేకానంద కేంద్రానికి ఈ బహుమతి ప్రకటించారు. 2016 సంవత్సరానికి దేశవ్యాప్తంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్, సులభ్ ఇంటర్నేషనల్ సంస్థలకు సంయుక్తంగా అవార్డు ఇస్తున్నారు. 2017 సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాలు, గిరిజన బాలలకు విద్యారంగంలో కృషి చేస్తున్న ఎకాయ్ అభియాన్ ట్రస్టుకు ఇవ్వగా, 2018 ..మిగతా 2లో

ఇదీలోకం!



సార్.. ఒకవేళ మనవాళ్లు రాహుల్ లేదా మమతతో రికమండేషన్ లెటర్ తెస్తే...?

ఆపరేషన్ ఫెయిల్

గుర్‌గావ్ నుంచి ఎమ్మెల్యేల తిరుగుపయనం



- సిద్దగంగ మఠాధిపతికి అనారోగ్యం
- ఆయన కోసమని వచ్చిన యడ్యూరప్ప
- అదే సాకుతో ఎమ్మెల్యేల తిరుగు టపా
- అట్టర్‌ఫ్లాప్‌గా మారిన ఆపరేషన్ కమలం
- నలుగురు తప్ప కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సేఫ్
- బీజేపీ ఎమ్మెల్యేలు ఇక పని చూసుకోవాలి
- వాళ్లందరికీ సాదర స్వాగతం: కేపీసీసీ చీఫ్

బెంగళూరు, జనవరి 17:

కర్ణాటకలో కాంగ్రెస్-జేడీఎస్ సర్కారును పడగొట్టాలనుకున్న బీజేపీ.. ఆ ప్రయత్నం విఫలం కావడంతో గుర్‌గావ్ రిసార్టులో ఉన్న తమ 104 మంది ఎమ్మెల్యేలను బెంగళూరుకు తిప్పి పంపింది. అందుకు సిద్దగంగ మఠం పీఠాధిపతి, 112 ఏళ్ల శివకుమారస్వామి ఆరోగ్యం బాగోకపోవడాన్ని సాకుగా తీసుకుంది. ఇటీవల ఆయనకు ఆరోగ్య సమస్యలు రావడంతో శస్త్రచికిత్స చేశారు. కానీ ఆ తర్వాతి నుంచి ఆయన ఆరోగ్యం మరింత విషమించసాగింది. దాంతో యడ్యూరప్ప తన ఎమ్మెల్యేలందరినీ తీసుకుని బుధవారం రాత్రి బయల్దేరి ..మిగతా 2లో

సీఈవోగా ద్వివేది

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి

- ప్రస్తుత సీఈవో ఆర్పీ సిసోదియా బదిలీ.. అందరి సహకారంతో ఎన్నికలు విజయం
- అధికారులు.. పార్టీలతో త్వరలో చర్చ.. తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు
- మీడియాతో గోపాలకృష్ణ ద్వివేది వ్యాఖ్య



అమరావతి, జనవరి 17:

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా గోపాలకృష్ణ ద్వివేది నియమితులయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ద్వివేది పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుత ఎన్నికల ప్రధానాధికారిగా ఉన్న ఆర్పీ సిసోదియాను బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకంపై ద్వివేది మాట్లాడుతూ అన్ని శాఖలు సహకరిస్తే ఎన్నికల ..మిగతా 2లో

వాతావరణం



ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం వాతావరణం పొడిగా, కొంత వేడిగా ఉండే అవకాశం ఉంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 28 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు
గాలిలో తేమ: 68 శాతం
గాలి వేగం: గంటకు 16 కి.మీ.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: శుక్లపక్షం, ద్వాదశి సా.5.22 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: రోహిణి ఉ.9.42 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: ప.3.03 నుంచి 4.35 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.51 నుంచి 9.34 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.14 వరకు, రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుంచి 4.30 వరకు, అమృతఘడియలు: ఉ.6.32 నుంచి 8.03 వరకు

మద్యానికి ఓకే



డాన్స్ బార్లలో మద్యం అమ్మకాలకు పచ్చజెండా

- వాటిని పూర్తిగా నిషేధించడం సరికాదు
- కావాలంటే నియంత్రణలు విధించండి
- 2005 తర్వాత ఒక్క లైసెన్సు ఇచ్చారా?
- స్కూళ్లు, గుళ్లకు 1 కి.మీ. దూరం కష్టం
- పెద్ద నగరాల్లో ఆ నిబంధన అసాధ్యం
- యజమానులకు 'సత్ప్రవర్తన' అక్కర్లేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం తుది తీర్పు...
- మహారాష్ట్ర డాన్స్‌బార్ ఓనర్లకు ఊరట



న్యూఢిల్లీ, జనవరి 17:

మహారాష్ట్రలో డాన్స్ బార్లపై ఉన్న కఠినమైన ఆంక్షలను సుప్రీంకోర్టు సడలించింది. డాన్స్ బార్లలో మద్యం అమ్మకాలు కూడా కొనసాగించుకోవచ్చని తెలిపింది. డాన్స్ బార్లను పూర్తిగా నిషేధించడానికి బదులు నియంత్రణలు విధించవచ్చని చెప్పింది. 2005 తర్వాత ఇంతవరకు ఏ ఒక్క డాన్స్ బార్‌కు ఇంతవరకు లైసెన్సు ఇవ్వలేదని గుర్తుచేసింది. ఆలయాలు, పాఠశాలలకు సమీపంలో అలాంటి వ్యవస్థలు ఉండకూడదని, అలాగే.. వాటి యజమానులకు మంచి ప్రవర్తన తప్పనిసరని ఉన్న నిబంధనలను సైతం సుప్రీంకోర్టు కొట్టేసింది. 2016 నాటి మహారాష్ట్ర చట్టాన్ని సవాలు చేస్తూ హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సుప్రీంకోర్టు.. గత సంవత్సరం ఆగస్టులో విచారణ ముగించి, తీర్పును వాయిదా వేసింది. ఆ తీర్పును గురువారం వెలువరించింది. ముంబై లాంటి నగరాల్లో ..మిగతా 2లో



అరకులో అంబారాన్నంటిన 'ఏరో స్పోర్ట్స్ బెలూన్' ఫెస్టివల్‌లో చివరిరోజు పర్యాటకులు పోటెత్తారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ ఫెస్టివల్‌లో దేశవిదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతి దూతలు వీరే!

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరానికి కుష్టువ్యాధి నివారణకు ప్రపంచ ఆరోగ్య సంస్థకు గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్న యొహై ససకవాను ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా కుష్టువ్యాధి నివారణకు కృషి చేసినందుకు ఆమెను ఎంచుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ, కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలోని జ్యూరీ సమావేశంలో ఈ అవార్డుల నిర్ణయం తీసుకున్నారు. 1995లో మహాత్మాగాంధీ 125వ జయంతి సందర్భంగా ప్రతియేటా ఈ అవార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. అవార్డులో భాగంగా కోటి రూపాయలు, ఒక సైటేషన్, హస్తకళల వస్తువు ఇస్తారు. 2000 సంవత్సరంలో ఈ అవార్డును నెల్సన్ మండేలాకు, బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంకుకు సంయుక్తంగా ఇచ్చారు. 2005లో ఆర్చ్‌బిషప్ డెస్మండ్ టుటు ఈ అవార్డు గెలుచుకున్నారు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత 2013లో చిప్కో ఉద్యమంతో సంబంధమున్న ప్రముఖ పర్యావరణవేత్త చండీప్రసాద్ భట్ దీన్ని అందుకున్నారు.

సీఈవోగా ద్వివేది

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియ విజయవంతమవుతుందన్నారు. ఎన్నికల నిర్వహణపై అధికారులు, రాజకీయ పార్టీలతో చర్చిస్తామని చెప్పారు. ఎన్నికల గడువు దగ్గర పడుతోందని, అందరి సమన్వయంతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని ద్వివేది ఆశాభావం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవని, ఓటర్లలోనూ చైతన్యం రావాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ద్వివేది చెప్పారు. ప్రస్తుత బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి గతంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఆమెకు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు. అలాగే తూర్పుగోదావరి జిల్లాకు కలెక్టర్‌గా కూడా గతంలో ఒకసారి పనిచేశారు.

1993 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన గోపాలకృష్ణను ఏపీ సీఈవోగా నియమిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాదు... ఆయనకు ఎలాంటి అదనపు బాధ్యతలు అప్పగించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సీఈసీ గోపాలకృష్ణ ద్వివేది మీడియాతో మాట్లాడారు. ''రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, ప్రజలు, అందరితో కలిసి పనిచేస్తాం. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూస్తాం. ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉంది. అయినా వీటి నిర్వహణను ఒక సవాలుగా తీసుకుని ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేస్తాం. ఓట్ల గల్లంతు విషయంలో ఓటర్లు అవగాహన కలిగి ఉండాలి. ఎలక్షన్ కమిషన్ కూడా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. ఓటర్లు వారి ఓటు హక్కు ఉందో లేదో తెలుసుకోవచ్చు'' అని ఆయన అన్నారు.

మద్యానికి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలలకు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు ఒక కిలోమీటరు దూరంలోనే డాన్స్‌బార్లు ఉండాలన్న నిబంధన అర్థరహితమని కోర్టు చెప్పింది. డాన్స్ బార్లలో డాన్సర్లకు కస్టమర్లు కావాలంటే టిప్‌లు ఇవ్వచ్చు గానీ, వాళ్ల మీద నోట్ల వర్షం మాత్రం కురిపించకూడదని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉన్న మొత్తం డాన్స్ బార్లన్నీ సాయంత్రం 6.30 నుంచి 11.30 వరకు మాత్రమే నడవాలని తెలిపింది. అయితే డాన్స్ బార్లలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఉండాలన్న నిబంధనను కోర్టు కొట్టేసింది. అది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగమని తెలిపింది. డాన్స్‌బార్ల యజమానులకు సత్ప్రవర్తన ఉండాలని, ఎలాంటి నేర చరిత్ర ఉండకూడదని ఉన్న నిబంధనను కూడా కోర్టు కొట్టేసింది. సత్ప్రవర్తనకు, నేరచరిత్రకు ఇంత లోపు అయితే మంచిదన్న కచ్చితమైన నిర్వచనం ఏమీ లేదని కోర్టు చెప్పింది. 2005 నుంచి ఇప్పటివరకు డాన్స్‌బార్లకు ఏ ఒక్కరికీ లైసెనసు ఇవ్వలేనద,ఇ ఇలా చేయడం కుదదరని జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది. కావాలంటే నియంత్రణలు ఉండచ్చు గానీ, పూర్తి నిషేధం కుదరదన్నారు. రాష్ట్రంలో 'మోరల్ పోలీసింగ్' నడుస్తున్నట్లు ఉందని కోర్టు గత సంవత్సరం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. పాఠశాలలు, ఆధ్యాత్మిక ప్రదేశాలకు ఒక కిలోమీటరు దూరం ఉండాలన్న నిబంధనను డాన్స్‌బార్ యజమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్ద పెద్ద నగరాల్లో ఇలాంటివి కుదరవని చెప్పారు. కోర్టు ఉత్తర్వులున్నా వాటిని ఉల్లంఘిస్తూ, డాన్స్‌బార్లకు అనుమతి ఇవ్వకూడదన్న పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తోందని చెప్పారు. అయితే తమ ప్రధాన ఉద్దేశం బార్ గరల్స్‌ను రక్షించడమేనని, అది ఇప్పుడు నెరవేరిందని మహారాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిశాంత్ కట్నేశ్వర్కర్ చెప్పారు. నిబంధనలను పాటిస్తూ ఎవరు ముందుకొచ్చినా వారికి తప్పకుండా లైసెన్సులు ఇస్తామన్నారు. 2016లో డాన్స్ బార్ నియంత్రణ బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అందులో డాన్సులు జరిగేచోట మద్యం ఇవ్వకూడదని, తప్పనిసరిగా రాత్రి 11.30లోపు మూసేయాలని నిబంధనలు విధించారు. దాంతోపాటు, నిబంధనలను పాటించని డాన్స్ బార్ యజమానులు, కస్టమర్లకు భారీ జరిమానాలు కూడా విధించారు. దాంతో వాటిని సవాలుచేస్తూ డాన్స్‌బార్, రెస్టారెంట్ల యజమానులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.



అహ్లె సున్నత్ వల్ జమాత్ నూతన కార్యవర్గం ఏర్పాటు

అమరావతి, జనవరి 17: అహ్లె సున్నత్ వల్ జమాత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గురువారం విజయవాడలో జరిగిన సమావేశానికి పదమూడు జిల్లాల నుండి హాజరైన ముస్లిం పండితులు, ఉలేమాలు, ముఫ్తీలు, సూఫీలు ముతవల్లీలు హాజరయ్యారు. షాబుఖారి కర్బలా మైదానంలో సూఫీ మత గురువులు పీఠాధిపతులు అల్తాఫ్ రజ్వీ అధ్యక్షతన సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఖలీఫా హుజూర్ అషఫ్రి హఫీజ్ మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ రజ్వీ, అధ్యక్షులుగా విజయవాడ పీఠాధిపతి ముస్లిం పండితులు ముఫ్తీ మొహమ్మద్ అబ్దుల్ ఖదేర్ రజ్వీ, ప్రధాన కార్యదర్శిగా మౌలానా మొహమ్మద్ సమీ ఉజమా రజ్వీ, కోశాధికారిగా పీఠాధిపతులు మత గురువులు సూఫీ అల్తాఫ్ రజ్వీ కొండపల్లి, ఉపాధ్యక్షులుగా మౌలానా మొహమ్మద్ గోహర ఆలమ భవానీపురం, మౌలానా ముహమ్మద్ రఫీ కాలం రజ్వీ మచిలీపట్నం మరియు స్పోక్ పర్సన్‌గా న్యాయవాది ముక్తార్ అలీ రజ్వీని ఎన్నుకున్నారు.

జ్ఞానానికి చిరునామా

(మొదటి పేజీ తరువాయి)



ఎక్స్‌ఎల్‌ఆర్ఐ క్యాంపస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఎక్స్‌ఎల్‌ఆర్ఐ దక్షిణ భారతదేశంలో మొదటి క్యాంపస్‌ని అమరావతిలో నెలకొల్పుతోందని, దాని నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఈరోజు చాలా మంచి రోజని అన్నారు. 1949లో ప్రారంభమైన ఈ సంస్థకు జంషెడ్ పూర్, భువనేశ్వర్‌లలో ఇప్పటికే క్యాంపస్‌లు ఉన్నాయని తెలిపారు. మనం 50 ఎకరాల భూమి ఇస్తే రూ. 235 కోట్లతో ఇక్కడ క్యాంపస్ నిర్మిస్తున్నారని చెప్పారు. దేశంలో అత్యున్నత విద్యాసంస్థగా ఈ క్యాంపస్ ఎదగాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యున్నత పరిశోధనా సంస్థలతో ఈ సంస్థ అవగాహన ఒప్పందాలు చేసుకుంటుందని తెలిపారు. ఈ సంస్థ నిర్మించబోయే అంతర్జాతీయ పాఠశాలకు 8 ఎకరాల భూమి ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దేశంలోని అత్యున్నత 20 విద్యాసంస్థలలో కనీసం పది సంస్థలను ఇక్కడకు రప్పిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే విట్, ఎస్ఆర్ఎం, అమృత వంటి సంస్థలు వచ్చాయని, ఇప్పుడు ఎక్స్‌ఎల్‌ఆర్ఐ కూడా వచ్చిందన్నారు. భవిష్యత్‌లో దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలన్నీ ఇక్కడే కొలువవుతాయని చెప్పారు. నాలెడ్జిపై పెట్టుబడులు పెడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజధాని అమరావతి నాలెడ్జి ఎకానమీకి కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నాలెడ్జి ద్వారానే అన్ని రంగాల్లో సమర్థమైన నాయకత్వం పెంపొందుతుందన్నారు. ఏ రాష్ట్రానికైనా రాజధానే ఆస్తి అన్నారు. అలాంటి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల చొరవ, త్యాగాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏనాడూ మరువదని చెప్పారు. ఇప్పటి వరకు చదువులు, ఉద్యోగాల కోసం మనం ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లేవారమని, ఇక ముందు ప్రపంచమే మన వద్దకు వస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం ఐఐటీ, ఐఐఎం, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏఐఎంఎస్.. లాంటి 11 విద్యాసంస్థలను ఏర్పాటు చేయవలసి ఉందని చెప్పారు. వాటి కోసం 2,912 ఎకరాల భూమి కేటాయించినట్లు తెలిపారు. అంతే కాకుండా వాటి కాంపౌండ్ వాల్స్ కోసం రూ.132 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దేశంలోని వంద టాప్ విశ్వవిద్యాలయాలలో ఆరు మన రాష్ట్రంలోనే ఉన్నట్లు తెలిపారు. 30 దేశాలు 679 మంది విద్యార్థులను ఎంపిక చేస్తే వారిలో 258 మంది ఆంధ్రప్రదేశ్ వారే ఉన్నట్లు చెప్పారు. ఎవరు అడ్డుకున్నా రాష్ట్రంలో అభివృద్ధి ఆగదని, అనుకున్న సమయానికే అన్నీ పూర్తి చేస్తామన్నారు. శంకుస్థాపన చేసిన రోజే దాని ప్రారంభోత్సవ తేదీ నిర్ణయిస్తున్నామని చెప్పారు. అనంతపురం జిల్లాలో ప్రారంభించిన కియా మోటార్స్ తొలి కారు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 29న రోడ్డెక్కనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సంస్థ కూడా 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతిలో అత్యంత ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా డక్ట్ ద్వారా గ్యాస్, మంచినీరు, సమాచార కేబుల్స్, మురుగు నీరు పారుదల వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే రాజధాని మొత్తానికి ఒకే చోట ఏసీ యూనిట్ ఏర్పాటు చేసి కావలసిన ఇంటికి పంపించే వ్యవస్థ గురించి పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా అమరావతిలో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెంచుతామన్నారు. మొక్కలను ఎక్కువగా నాటి చెట్లను పెంచవలసిన అవసరం ఉందని చెప్పారు. అలాగే ప్రకృతి సేద్యం ద్వారా మంచి ఆహారం, మంచి గాలితోపాటు కృష్ణానది నుంచి మంచినీరు అందిస్తే వందేళ్లకు పైగా బతకడానికి అవకాశం ఉంటుందన్నారు. అమరావతిని ఆనందనగరంగా, దేవతల రాజధానిగా అభివర్ణించారు. ఎక్స్‌ఎల్‌ఆర్ఐకు ప్రభుత్వం, సీఆర్డీఏ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. ప్రముఖ నిర్మాణ సంస్థలన్నీ ఇక్కడే ఉన్నాయని, నిర్మాణాలు వేగంగా పూర్తి అవుతాయని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ పి. నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యే ఫిలిప్స్ సి. థాచర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జానీమూన్, మంగళగిరి మునిసిపల్ చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, సీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, గుంటూరు బిషప్ ఫాదర్ బి చిన్నబత్తిని, విజయవాడ బిషప్ ఫాదర్ టీ జోసెఫ్ రాజారావు, ఆంధ్ర జోసూట్ ప్రావిన్స్, ప్రావిన్సియల్ ఫాదర్ పీఎస్ అమల్‌రాజు, ఎక్స్‌ఎల్‌ఆర్ఐ జంషెడ్‌పూర్ డైరెక్టర్ ఫాదర్ ఈ.అబ్రహం, అడ్మినిస్ట్రేటివ్ అండ్ ఫైనాన్స్ డీన్ ఫాదర్ జెరోమ్ కుటిన్హా, అకడమిక్ డీన్ డాక్టర్ అశీష్ కె పాణి, అమరావతి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఫాదర్ కె.ఎస్.కాసిమర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ ఫెయిల్



(మొదటి పేజీ తరువాయి)

బెంగళూరు చేరుకున్నారు. స్వామిని దర్శించుకోవాలని సాకుగా చెప్పారు. వారాంతానికల్లా కుమారస్వామి సర్కారును పడగొట్టాలని తొలుత భావించారు. కానీ కొంతమంది ఎమ్మెల్యేలు ఢిల్లీలో చలిని తట్టుకోలేకపోతున్నామని, అందువల్ల ఇళ్లకు వెళ్లిపోతామని గొడవ చేసినా, త్వరలోనే తీపికబురు అందుతుందని చెబుతూ నాయకులు వాళ్లను ఇన్నాళ్ల పాటు ఆపారు. అయితే, 'ఆపరేషన్ కమలం' అట్టర్‌ఫ్లాప్ అయిన విషయం బుధవారం మధ్యాహ్నానికల్లా వారికి స్పష్టమైంది. దాని వల్ల ఎలాంటి ఫలితం రాదని తేలిపోయింది. సాయంత్రం విమానానికే బెంగళూరు బయల్దేరిన యడ్యూరప్ప.. స్వామి ఆరోగ్యం బాగోలేదని, ఆయనను చూసి ఒక రోజులో తిరిగి వచ్చేస్తానని ఎమ్మెల్యేలకు తెలిపారు. కానీ, గురువారం ఉదయం ఆయన ఉన్నట్టుండి యూటర్న్ తీసుకున్నారు. కుమారస్వామి ప్రభుత్వాన్ని పడగొట్టే ఆలోచన ఏమీ తమకు లేదని.. బీజేపీ ఎమ్మెల్యేలు గుర్‌గావ్‌లోని రిసార్టులో రిలాక్స్ అవుతున్నారని చెప్పారు. తుముకూరులోని మఠానికి వెళ్లిన తర్వాత.. తాను మఠంలోనే ఉండి రెండు రోజుల పాటు స్వామిని కనిపెట్టుకుని ఉంటానని మీడియాకు తెలిపారు. జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణం చేతులలో అవమానపడటానికి ఈ నాయకులే కారణమని కొంతమంది బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. తన పేరు బయట పెట్టొద్దని కోరిన ఒక నాయకుడు దీనిగురించి వివరంగా చెప్పారు. ''ఈసారి మనం విఫలం కామని, ఎలాగైనా వారం రోజుల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని ఎమ్మెల్యేలందరికీ చెప్పారు.

జేడీఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి బీజేపీలోకి ఎవరెవరు వస్తున్నారోనంటూ వాళ్ల పేర్లు కూడా చెప్పారు. అందుకే మా ఎమ్మెల్యేలంతా గుర్‌గావ్‌లోని రిసార్టులో ఐకమత్యంగా ఉండేందుకు అంగీకరించారు. మాలో కొందరిని జేడీఎస్, కాంగ్రెస్ లాక్కోకుండా ఉండేందుకు జాగ్రత్త పడ్డాం. కానీ, ఇది మరోసారి విఫలమైంది'' అని ఆయన అన్నారు. దక్షిణ కన్నడ ఎంపీ నళిన్‌కుమార్ కటీల్, మహారాష్ట్ర మంత్రి రామ్ షిండే కూడా వారాంతానికల్లా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గూఢచర్యం ఫలితమేనా?

విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం, బీజేపీ శిబిరంలో ఏం జరుగుతోందో తెలుసుకోడానికి ముఖ్యమంత్రి కుమారస్వామి విజయవంతంగా తన గూఢచారులను గుర్‌గావ్ రిసార్టులో ప్రవేశపెట్టగలిగారు. దాంతో.. అక్కడ ఏం జరుగుతోందో ప్రతి నిమిషానికి తెలియడంతో వెంటనే దానికి తగ్గ వ్యూహాలను రూపొందించుకుని తమ ఎమ్మెల్యేలెవరూ జారిపోకుండా జాగ్రత్త పడగలిగారు. ముంబై హోటల్లో బీజేపీ వాళ్లు ఉంచిన ఎమ్మెల్యేలతో మాట్లాడి, వాళ్లను తిరిగి బెంగళూరు రప్పించారు. నలుగురు తప్ప మిగిలినవాళ్లంతా బెంగళూరు తిరిగి రావడంతో ప్రభుత్వం సురక్షితంగా నిలబడింది. మాజీమంత్రి రమేశ్ జర్కిహోలి నేతృత్వంలోని నలుగురు రెబెల్ ఎమ్మెల్యేలు కూడా గురువారం రాత్రి ఏదో సమయానికి వచ్చేస్తారంటున్నారు. అయితే వాళ్లు పార్టీలో కొనసాగుతారా, రాజీనామా చేస్తారా అన్నది మాత్రం ఇంకా స్పష్టం కాలేదు. వాళ్లు రాజీనామా చేసినా సర్కారుకు వచ్చిన ముప్పేమీ లేదు. తమ పార్టీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలను సీఎల్పీ నాయకుడు, మాజీ సీఎం సిద్దరామయ్య అత్యవసరంగా సమావేశపరిచి, వారికి విప్ జారీచేశారు. ఎవరైనా దాన్ని మీరితే పార్టీ ఫిరాయింపు చట్టం కింద అనర్హత వేటు పడుతుందని హెచ్చరించారు. జేడీఎస్ చీఫ్, మాజీ ప్రధాని దేవెగౌడ కూడా తమ పార్టీకి చెందిన 37 మంది ఎమ్మెల్యేలు జారిపోకుండా జాగ్రత్త పడ్డారు.

బీజేపీకి ఎద్దేవా


గుర్‌గావ్ నుంచి తిరిగి వస్తున్న 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది. మూడు రోజుల పాటు విశ్రాంతి తీసుకుని తిరిగి వస్తున్నవాళ్లకు హార్దిక స్వాగతమని.. ఇక ఇప్పుడు పనిలో పడాలని కేపీసీసీ చీఫ్ దినేశ్ గుండూరావు ట్వీట్ చేశారు. ఇప్పటికి వాళ్లు పూర్తిగా జవసత్వాలు సమకూర్చుకున్నారు కాబట్టి వాళ్ల వాళ్ల నియోజవర్గాలకు వెళ్తారని, ఇన్నాళ్లబట్టి నిర్లక్ష్యం చేసిన పనిలోకి దిగుతారని ఆశిస్తున్నట్లు ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. వాళ్లున్న ఒక్కో గదికి రోజుకు రూ. 30వేలు ఖర్చవుతుందని అన్నారు. ఆపరేషన్ కమలం డ్రామా ముగిసిందని ఉప ముఖ్యమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర వ్యాఖ్యానించారు. తమకు ఎమ్మెల్యేలందరి మద్దతు ఉందని, అందువల్ల సంకీర్ణ ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలేవీ సఫలం కావని అన్నారు. కాగా, ఆపరేషన్ లోటస్ విఫలమైనట్లేనా అని యడ్యూరప్పను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, అసలు కుమారస్వామి సర్కారును పడగొట్టే ఉద్దేశం తమకు లేదని.. తమ ఎమ్మెల్యేలను వాళ్లు లాక్కునేందుకు ప్రయత్నిస్తుంటే వాళ్లను కాపాడుకున్నామని చెప్పారు. పైగా లోక్‌సభ ఎన్నికలు త్వరలో వస్తుండటంతో వాటిగురించిన ప్రణాళికల కోసమే తాము అక్కడికి వెళ్లినట్లు తెలిపారు.

నిధులు రాబట్టండి

- కేంద్రానికి యూసీలు పంపండి
- అధికారులకు సీఎస్ పునేఠా ఆదేశం



అమరావతి, జనవరి 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద అందించే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంతోపాటు సకాలంలో యూసీలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) కేంద్రానికి పంపడం ద్వారా మరిన్ని నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సెంట్రల్ అసిస్టెన్స్ టు స్టేట్ డెవలప్మెంట్ స్కీమ్స్ అనే అంశంపై వివిధ శాఖల అధికారులతో గురువారం అమరావతి సచివాలయంలో సిఎస్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆర్థికశాఖ కార్యదర్శి పియూష్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రాష్ట్ర పథకాలకు కేంద్రం నుండి వివిధ శాఖలకు కేటాయించిన, విడుదల చేసిన నిధులు వినియోగం, వినియోగపత్రాలు సమర్పించిన తదితర అంశాలను వివరించారు. ముఖ్యంగా 2016-17లో కేంద్రం నుండి వివిధ కేంద్ర సహాయంగా 13వేల 329 కోట్ల రూ.లు, 2017-18లో 13వేల 191 కోట్ల రూ.లు విడుదల అయ్యాయని తెలిపారు. 2018-19 ఆర్థికసంవత్సరానికిగాను డిశంబరు 31 నాటికి 9వేల 654 కోట్ల రూపాయలు విడుదల అయ్యాయని ఈ ఆర్థిక సంవత్సరాంతానికి మొత్తం 15వేల కోట్ల రూ.లు నిధులు రావచ్చని ఆశిస్తున్నట్టు వివరించారు. వివిధ శాఖలవారీగా ప్రతిపాదించిన పథకాలు కేంద్రం నుండి మంజూరైన నిధులు వాటికి సంబంధించిన యుసిలు కేంద్రానికి పంపిన వివరాలను శాఖలవారీగా ఆయన సీఎస్‌కు వివరించారు. అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుండి విడుదలైన నిధులను సకాలంలో ఖర్చుచేయడంతో పాటు యుసిలను సకాలంలో పంపి మరిన్ని నిధులు రాబట్టేందుకు అన్ని శాఖలు చిత్తశుద్ధితో క షి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో చర్చించిన వివిధ అంశాలపై మినిట్స్ రూపొందించి ఒక కాపీని ఢిల్లీలోని ఏపి భవన్ రెసిడెన్స్ కమిషనర్‌కు పంపాలన్నారు.



డేరా బాబాకు జీవిత ఖైదు

- జర్నలిస్టు హత్యకేసులో తీర్పు

పంచకుల, జనవరి 17: జర్నలిస్ట్ రామచంద్ర ఛత్రపతి హత్య కేసులో దోషిగా తేలిన డేరా బాబా గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు పంచకుల సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఆయనతో పాటు దోషులుగా తేలిన మరో ముగ్గురు కుల్దీప్ సింగ్, నిర్మల్ సింగ్, కృషన్ లాల్‌కు జీవిత ఖైదు విధిస్తున్నట్లు న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దీంతో పాటు ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున జరిమానా విధించింది. శిక్ష ఖరారుకు సంబంధించిన విచారణకు గుర్మీత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యాడు. 2002లో సిర్సాకు చెందిన జర్నలిస్ట్ ఛత్రపతిని హత్య చేసినందుకు గానూ గుర్మీత్‌పై కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో వీరిని దోషులుగా తేలుస్తూ గత వారం కోర్టు తీర్పు ప్రకటించిన విషయం తెలిసిందే. అత్యాచారం కేసులో గుర్మీత్ ఇప్పటికే 20ఏళ్ల జైలు శిక్షను అనుభవిస్తున్నాడు. హరియాణాలోని రోహ్‌తక్ సునారియా జైల్లో ఖైదీగా ఉన్నాడు. అత్యాచారం కేసు తీర్పు సమయంలో పంచకులలో పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగి దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో గురువారం కోర్టు పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. కోర్టు సమీప ప్రాంతాల్లో 144సెక్షన్‌ను విధించారు. డేరా ఆశ్రమంలో గుర్మీత్ చేస్తున్న అక త్యాలను 'పూరా సచ్' వార్తాపత్రికకు చెందిన జర్నలిస్ట్ ఛత్రపతి వెలుగులోకి తీసుకొచ్చారు. ఆశ్రమానికి వచ్చిన మహిళలను లైంగికంగా వేధిస్తూ, వారిపై అత్యాచారాలకు పాల్పడుతున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే అక్టోబరు 24, 2002న ఛత్రపతిని ఆయన ఇంట్లోనే దారుణంగా కాల్చి చంపారు. ఈ కేసులో గుర్మీత్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

'హిల్ ఫెస్ట్' ఏర్పాట్లు పరిశీలించిన స్పీకర్

కోటప్పకొండ, జనవరి 17, మనం ప్రతినిధి: కోటప్పకొండలో జరగనున్న 'హిల్ ఫెస్టివల్' ఏర్పాట్లను స్పీకర్ కోడెల శివప్రసాద రావు పరిశీలించారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఇక్కడ జరగనున్న హిల్ ఫెస్టివల్ నేపథ్యంలో స్పీకర్ పర్యటన సాగింది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో మన సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా సాగనున్నట్టు ఆయన వివరించారు. పర్యావరణం, చెట్లు, కొండల గొప్పతనం వివరించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఎకో టూరిజం అభివృద్ధి చేయడం, మొక్కల విశిష్ఠతను చాటేలా పండుగ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. వీఐపీల తాకిడి నేపథ్యంలో బందోబస్తుపై పోలీస్ అధికారులకు స్పీకర్ దిశానిర్దేశం చేశారు.

ఎన్టీఆర్.. మహానేత

- ప్రజల గుండెల్లో ఆయన స్థానం పదిలం: సుహాసిని

గుంటూరు, జనవరి 17: ఎన్టీఆర్ ప్రజా నాయకుడని తెలుగు ప్రజల గుండెల్లో ఆయన స్థానం ఎప్పటికి పదిలంగా ఉంటుందని టీడీపీ నాయకురాలు నందమూరి సుహాసిని అన్నారు. గుంటూరులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. సినీ పరిశ్రమ, రాజకీయ రంగాల్లోనూ ప్రజల కోసమే ఆయన తపించారని తెలిపారు. ప్రజలు ఎన్టీఆర్‌ని దేవునిగా ఆరాదిస్తున్నారని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. పార్టీ స్థాపించి అనేకమంది సామాన్యులకు చట్టసభలకు పంపిన ఘనత కూడా ఎన్టీఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏ.వి.రమణ, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్ర, అన్నాబత్తిని శ్రావణ్‌కుమార్, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, కావూరి చంద్రమోహన్, గోగినేని తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దావోస్ పర్యటన రద్దు

అమరావతి, జనవరి 17: సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన రద్దయినట్లు ప్రకటించారు. ఎన్నికలు, పార్టీ కార్యక్రమాలపై దృష్టి సారించేందుకు పర్యటన రద్దు చేసుకున్నట్లు తెలిపారు. పార్టీ నేతల సూచనతో సీఎం పర్యటన రద్దు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ఇప్పటికే మంత్రి లోకేష్ దావోస్ పర్యటన ఖరారైంది. దావోస్‌లో సీఎం హాజరయ్యే సమావేశాల్లో లోకేష్ పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ నెల 21న సాయంత్రం 3 గంటలకు క్యాబినెట్ భేటీ కానుంది. సచివాలయం మొదటి బ్లాక్, క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో ఈ సమావేశం జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా గురువారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.



టీడీపీ బలోపేతానికి కృషి

- చంద్రబాబుతో దేవినేని అవినాష్ భేటీ

అమరావతి, జనవరి 17: సీఎం చంద్రబాబుతో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు దేవినేని అవినాష్, టీడీపీ నేత కడియాల బుచ్చిబాబు గురువారం భేటీ అయ్యారు. తెలుగు యువత అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. యువత పార్టీ వైపు ఆకర్షితులు అయ్యేవిధంగా పని చేస్తానని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు అన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తానని చెప్పారు. మోదీ,కేసీఆర్, జగన్ కలిసి చంద్రబాబుపై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుని తాకాలంటే ముందు తెలుగు యువత ని దాటి రావాలని తీవ్రస్వరంతో వ్యాఖ్యానించారు.

300 కోట్లతో విశాఖ రైల్వేస్టేషన్

ఆధునీకరణ పనులు

- ప్రతిపాదనలు పంపాం: సుబ్బరామిరెడ్డి



విశాఖపట్నం, జనవరి 16: విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధికి మూడు వందల కోట్లు మంజూరు చేసేలా రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపుతామని రాజ్యసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ సుబ్బరామి రెడ్డి తెలిపారు. బోర్డు అధ్యక్షునితో ఈ అంశంపై మాట్లాడి త్వరలో ఈ మూడు వందల కోట్లు వచ్చేలా చూస్తామని అన్నారు. బుధవారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో పరిశ్రమలు, బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వాల సంస్థల ప్రతినిధులతో కమిటీ సమావేశమై ఘన వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ, ఫేక్ నోట్ల చలామణి నియంత్రణ, బ్యాంకులో మోసాలు నియంత్రణ, రైల్వే స్టేషన్ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించింది. అనంతరము కమిటీ చైర్మన్ సుబ్బరామిరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం పలు నియమ నిబంధనలు ఆదేశాలు జారీ చేసిందన్నారు. వాటి అమలును సమీక్షించి మరింత పటిష్టంగా అమలుపరిచి కాలుష్య నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. విశాఖనగరాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చి దిద్దాలని సూచించామన్నారు. నగరంలో 40 లక్షలు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 38 లక్షల మొక్కలు నాటినట్లు ఆయన తెలిపారు. పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి, నదుల్లోకి వదలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. బ్యాంకులో జరిగే మోసాలు అరికట్టేందుకు, ఫేక్ నోట్ల చలామణి నియంత్రణకు ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్ మెమో జారీ చేసిందన్నారు. దాని అమలును సమీపించినట్లు ఆయన తెలిపారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఇప్పటికీ 13 వేల మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. త్వరలో మరో రెండు మూడు బిల్డింగులు పూర్తి కానున్నాయని, అది పూర్తయితే మరింతమందికి మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, పలు బ్యాంకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్‌ను విమర్శించిన

కేసీఆర్‌తో స్నేహమా?

- వైసీపీ నేతలకు తులసి రెడ్డి ప్రశ్న

విజయవాడ, జనవరి 17: రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు జగన్‌కు వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని కాంగ్రెస్ సీనియర్ నేత తులసీ రెడ్డి విమర్శించారు. గురువారం విజయవాడ ఆంధ్రా రత్న భవన్‌లో ఆయన మాట్లాడుతూ డబ్బు కోసం సీమాంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిన టీఆర్ఎస్‌తో వైసీపీ కలుస్తోందని మండిపడ్డారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని విమర్శించిన కేసీఆర్‌తో జగన్ స్నేహం చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పేరు తీసేసి... ఏపీటీఆర్ఎస్ పేరు పేడతారేమోనని అన్నారు. ఏపీకి వైసీపీ వేరు పురుగ్గా, చీడ పురుగుగా తయారైందన్నారు. డబ్బుల మూటలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎంతకైనా జగన్ దిగజారుతారని తులసీ రెడ్డి అన్నారు.

ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు వేలంపాట పెట్టారని, ఎవరు ఎక్కువ ఇస్తే వాళ్లకే టిక్కెట్లు ఇస్తారని తులసీ రెడ్డి విమర్శించారు. ఇప్పుడ హోల్‌సేల్‌గా కేసీఆర్ ఇచ్చే డబ్బుకోసం రాష్ట్రాన్ని, పార్టీని తాకట్టుపెట్టే స్థాయికి తీసుకుపోయారని ఆయన ఆరోపించారు. నెం.1 ఎనిమీ ఎవరంటే టీఆర్ఎస్.. కేసీఆర్.. ఏపీ ప్రజలపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ ఆంధ్రా ప్రజల చెవుల్లో రింగ్ మంటున్నాయన్నారు. సీమాంధ్రులను పంచెలు ఊడదీసికొడతామని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తులసీ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అది 'ఆంధ్ర ద్రోహుల ఫ్రంట్'.. ఆనంద్ సూర్య

విజయవాడ, జనవరి 17, మనం ప్రతినిధి: ఫెడరల్ ఫ్రంట్ పేరుతో ఆంధ్ర ద్రోహులంతా ఒక చోటకు చేరారని బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సూర్య ఆరోపించారు. మోదీ దర్శకత్వంలో కేసీఆర్‌తో కలిసి ఫెడరల్ ఫ్రంట్ పేరుతో 'ఆంధ్ర ద్రోహుల ఫ్రంట్' ప్రారంభించారని సూర్య అన్నారు. పదేపదే ఆంధ్రులను చులకన చేసి మాట్లాడే కేసీఆర్‌తో జగన్ జట్టు కట్టారన్నారు. స్వరాష్ట్రంలో, దేశంలో తన ఉనికి కాపాడుకునేందుకు, తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు ఫెడరల్ ఫ్రంట్ నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ఓటింగ్ పెడితే, కేసీఆర్, జగన్ ఓటింగ్‌లో పాల్గొనలేదని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రులు విజ్ఞులని టీఆర్ఎస్‌తో కలిసి జగన్ ఎన్ని కుట్రలు చేసినా తిప్పి కొడతారని సూర్య పేర్కొన్నారు.

అంతర్ రాష్ట్ర దోపిడీ దొంగలు అరెస్టు



- ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 31 కేసులు
- పిస్టల్, కత్తితో పాటు, రూ.14లక్షల చోరీ సొత్తు స్వాధీనం



ఒంగోలు, జనవరి 17, (మనం న్యూస్‌బ్యూరో): ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల్లో దోపిడీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14లక్షల విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ప్రకాశం జిల్లా ఎస్పీ సత్య ఏసుబాబు వెల్లడించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని ఆత్మకూరు గ్రామానికి చెందిన పొన్నూరు సత్యానందం, మాచర్ల పట్టణానికి చెందిన మూలి ఫణిందర్ రెడ్డి, మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన మోమిన్ సైదా, అదే గ్రామానికి చెందిన పాదిలి జోజిబాబులు ఒక ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. గుంటూరు, కృష్ణా జిల్లాలతో పాటు, తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 24 నేరాలతో మొత్తం 31 నేరాలు చేసినట్లు వారు అంగీకరించారన్నారు. వారి వద్ద నుంచి 104 బంగారు అభరణాలు, 15 కేజీల వెండి, ఒక పిస్టల్, నాలుగు బుల్లెట్లు, కత్తి, 7మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రకాశం జిల్లా దొనకొండ ప్రాంతంలో వారిని అరెస్టు చేశామన్నారు.వీరి పై గతంలో గుంటూరు జిల్లాలో కూడా 15 కేసులు నమోదైఉన్నట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన దర్శి ఇన్‌ఛార్జి డిఎస్పీ వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొదిలి సిఐ కె.ఎస్.సిహెచ్ మీరా సాహెబ్, దొనకొండ ఎస్సై పి.సుబ్బారావు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.





పింఛను రెట్టింపు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపిన డప్పు కళాకారులు, చర్మకారులు

త్వరలో ఏపీకి కేసీఆర్

- తెలంగాణ మంత్రి తలసాని



అమరావతి, జనవరి 17: తెలంగాణలో స్థిరపడిన ఏపీ ప్రజలకు అండగా ఉంటామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఏపీ అభివృద్ధికి తాము అడ్డుపడుతున్నామంటూ తెదేపా నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. త్వరలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఏపీకి వెళ్తున్నారని, భవిష్యత్‌లో అక్కడ కూడా రాజకీయాలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు పాలనపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. అక్కడ అవినీతి పెరిగిపోయిందని, ప్రచార ఆర్భాటమే ఎక్కువగా కనిపిస్తోంది విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ తాను పర్యటిస్తానని తలసాని చెప్పారు. కులాల మధ్య చిచ్చుపెట్టింది చంద్రబాబేనని ఆయన దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రజల్ని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, కాంగ్రెసేతర ప్రభుత్వమే లక్ష్యంగా ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కేసీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని.. చంద్రబాబు లేకున్నా అభివృద్ధి సాధ్యమవుతుందని టీఆర్ఎస్ ప్రభుత్వం నిరూపించిందని చెప్పారు. బంధాలు, బంధుత్వాల గురించి చంద్రబాబుకు ఏం తెలుసని తలసాని వ్యాఖ్యానించారు.

సోషల్ మీడియాకు అందరూ బాధితులే

- షర్మిళపై అసభ్య ప్రచారం బాధాకరం
- నియంత్రణకు కఠిన చట్టాలు తేవాలి: సోమిరెడ్డి

అమరావతి, జనవరి 17: సోషల్ మీడియాలో షర్మిలపై వస్తున్న అసభ్య ప్రచారం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఖండించారు. సోషల్ మీడియాకు అందరూ బాధితులేనని వెలగపూడి సచివాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. షర్మిళపై వస్తున్న ఆరోపణలను 2014లోనే ప్రభాస్ ఖండించారని, ఐదేళ్ల తరవాత మరలా ఆ విషయాన్ని కావాలనే తెరమీదకు తెచ్చారని మంత్రి విమర్శించారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సీఎం సీటు కోసం ఎంతకైనా దిగజారుతారు అనడానికి ఇదే నిదర్శనం అని సోమిరెడ్డి ధ్వజమెత్తారు. వైసీపీ ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ఏర్పాటు చేసుకుని టీడీపీ మహిళా నేతలపై అసభ్యంగా ప్రచారం చేసింది నిజంకాదా అని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియాలో కొంతమంది పనిలేని వారు చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఇలాంటి పోకడలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తేవాలని ఆయన కోరారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై, జగన్మోహన్ రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేశారో అందరికీ తెలుసని మంత్రి సోమిరెడ్డి గుర్తుచేశారు. షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యంగా ప్రచారం చేయడంలో సీఎం చంద్రబాబు నాయుడు పాత్ర ఉందని చెప్పడం సబబు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఏపీ పోలీసులపై నమ్మకం లేని వైసీపీ నేతలు తెలంగాణలో కేసులు పెడుతున్నారని, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ఏపీలో గృహప్రవేశం చేయాలని చూస్తున్న జగన్మోహన్ రెడ్డికి ఏపీ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లేదని ఆయన దుయ్యబట్టారు. పోలవరం ప్రాజెక్టులో 7 ముంపు మండలాలపై సుప్రీంకోర్టులో టీఆర్ఎస్ నాయకురాలు, ఎంపీ కవిత కేసు వేశారని మంత్రి గుర్తుచేశారు. ఫెడరల్ ఫంట్ ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని, అక్కడ ఫ్రంట్, బ్యాక్ ఏమీ లేదని మంత్రి ఎద్దేవా చేశారు. మోదీ గాడు అని తిట్టిన కేసీఆర్ తరవాత ఢిల్లీ వెళ్ల ప్రధాని కాళ్లకు సాష్టాంగ నమస్కారాలు చేశాడని మంత్రి విమర్శించారు. ఏపీలో ఊహించని అభివృద్ధి జరుగుతుంటే టీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని సోమిరెడ్డి దుయ్యబట్టారు. తిత్లీ తుపానుకు తడసిన ధాన్యం కూడా కేంద్రం కొనుగోలు చేయడం లేదని దీనిపై వైసీపీ నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. తిత్లీ తుఫానుకు తడిసిన ధాన్యం క్వింటా రూ.1550కు కొనుగోలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. నాలుగున్నర సంవత్సరాల్లో ఏపీలో అభివృద్ధి చేసి తాము నిరూపించుకున్నామని, కేసీఆర్‌ను చూసి నేర్చుకోవాల్సిన అవసరం లేదని మంత్రి సోమిరెడ్డి అభిప్రాయపడ్డారు. కేవలం సామాజిక ఫించన్లకే రాబోయే ఐదు సంవత్సరాల్లో రూ.70 వేల కోట్లు ఖర్చు చేయనున్నామని ఆయన గుర్తుచేశారు. లోటు బడ్జెట్ ఉన్నా తెలంగాణ కన్నా వ్యవసాయ రంగంలో రూ.17000 కోట్లు అధనంగా ఖర్చు చేశామని మంత్రి తెలిపారు.

సంబరంగా 'ఏరో స్పోర్ట్స్'

- పెద్ద సంఖ్యలో పర్యాటకులు హాజరు
- సందడిగా మారిని అరకులోయ
- మంచి స్పందన లభిస్తోంది: శివశంకర్









శ్రీకాకుళం, జనవరి 17 (మనం న్యూస్ బ్యూరో): ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్‌కు అనూహ్య స్పందన లభించిందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లోతేటి శివశంకర్ తెలిపారు. బుధవారం గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఏరో స్పోర్ట్స్ ఫెస్టివల్ ముగింపు ఉత్సవాల కార్యక్రమం సందర్భంగా పి.ఓ. మాట్లాడుతూ, రాష్ట్రంలోనే ప్రప్రధమంగా నిర్వహించిన ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్ కు జిల్లా ప్రజలతో పాటు వివిధ జిల్లాల నుండి అనేక మంది పర్యాటకులు విచ్చేసారని తెలిపారు. జనవరి 13 నుండి 15వ తేదీ వరకు ఉత్సవాలు జరపాలని నిశ్చయించామని, ప్రజలందరూ ఈ ఫెస్టివల్ లో పాల్గొనడానికి అవకాశం కలిగించాలనే ఉద్దేశ్యంతో 16వ తేదీ వరకు నిర్వహించామని తెలిపారు. సాహసం చేయరా డింభకా... అనే నినాదంతో నిర్వహించిన ఈ క్రీడలలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ఈ క్రీడలకు ఎక్కువ మంది పాల్గొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని చెప్పారు. సంయుక్త కలెక్టరు వారి కుటుంబసభ్యులతో ఏరో స్పోర్ట్సు ఫెస్టివల్‌లో వుత్సాహంగా పాల్గొన్నారని, ప్రాజెక్టు అధికారి చెప్పారు. గత నాలుగు రోజులుగా నిర్వహించిన పారా మోటార్స్ రైడ్స్‌లో 310 మంది, పారా సెయిలింగ్‌లో 220 మంది, హాట్ ఎయిర్ బెలూన్‌లో 70 మంది, వుత్సాహంగా పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు.

బుధవారం 15 వేల మంది విజిటర్స్ వచ్చారని, నాలుగు రోజులలో సుమారు 30 వేల మంది పర్యాటకులు సందర్శించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడలతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పి.ఓ. తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్, పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శుక్రవారం, జనవరి 18

కొలీజియంపై కొత్త వివాదం

దేశంలో ప్రజాస్వామ్యానికి కొంతవరకైనా కాపాలా ఉంటుందని భావిస్తున్న న్యాయ విభాగం కూడా వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడం ప్రజాస్వామ్య ప్రియులకు ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలపై న్యాయవిభాగం అభిప్రాయం కోసం ఎన్నో ఆశలతో, మరెన్నో ఆకాంక్షలతో ఎదురుచూస్తున్న ప్రజలకు న్యాయవిభాగంలో తలెత్తిన కొత్తవివాదం ఆవేదనకు దారితీస్తోంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక తీరులో కొలీజియం తీరు అనేక సందేహాలకు, అనుమానాలకు దారితీసే విధంగా ఉండడం పట్ల న్యాయనిపుణులే అభ్యంతరాలు వ్యక్తంచేస్తుండడం గమనార్హం. గత డిసెంబర్ 12న కొలీజియం సభ్యులైన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ ఎకె సిక్రి, జస్టిస్ ఎస్ఈ బొబ్డె, జస్టిస్ ఎన్వి రమణ సమావేశమై కొంతమంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేశారు. అయితే గత నెల 31న జస్టిస్ లోకుర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో జస్టిస్ అరుణ్ మిశ్రా నియమితులయ్యారు. నూతన కొలీజియం గత పదో తేదీన సమావేశమై పాత నిర్ణయాన్ని రద్దుచేసి కొత్తగా న్యాయమూర్తులను నియమించాలని నిర్ణయించింది. మొదట నిర్ణయం తీసుకున్న పేర్లలో రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నందరాజోగ్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేంద్ర మీనన్‌ల స్థానంలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టుకు చెందిన జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్లతో రాష్ట్రపతి ఆమోదం కోసం జాబితా వెళ్లడం వివాదానికి కారణమైంది.

జాబితాలో జరిగిన ఈ మార్పుపై న్యాయనిపుణులు అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం పూర్తిగా సీనియారిటీ ప్రాతిపదికన జరగాల్సి ఉన్నది. అయితే, జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ సంజీవ్ ఖన్నాల కంటే మొదటిసారిగా జాబితాలో చోటుచేసుకున్న జస్టిస్ నందరాజోగ్, జస్టిస్ రాజేంద్ర మీనన్ సీనియర్లని న్యాయనిపుణులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ఇలా వ్యక్తిగత నిర్ణయాలపై స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలు నడవరాదని, గతంలో ఏ సంప్రదాయాన్ని అనుసరించి వ్యవహరిస్తున్నారో వాటినే అనుసరించాలని న్యాయనిపుణులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలన్నీ (సీబీఐ, ఆర్‌బీఐ తదితరమైనవి) కేంద్ర ప్రభుత్వ జోక్యంతో నిర్వీర్యమైపోతున్న నేపథ్యంలో ఇప్పుడు న్యాయవిభాగంలో తలెత్తిన ఈ వివాదం ఆందోళన కలిగిస్తోంది. గతంలో సుప్రీంకోర్టు కొలీజియం వ్యవహార శైలిని ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ విలేకరుల సమావేశంలో తప్పుపట్టిన విషయం విదితమే. అలాంటి వ్యవహార శైలినే ఇప్పుడు ఆయన ప్రధాన న్యాయమూర్తిగా అనుసరించడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.


న్యాయవిభాగంలో కేంద్ర ప్రభుత్వ జోక్యం కొత్తగాకున్నా, ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో చోటుచేసుకున్న సంఘటనలు అప్పట్లో తీవ్ర సంచలనం కలిగించాయి. కానీ, ప్రస్తుత ప్రభుత్వం జోక్యంతో పోల్చితే ఇందిర ప్రభుత్వ జోక్యం కొంతవరకు పారదర్శకాన్ని కలిగివుండేవి. 1973 ముగ్గురు న్యాయమూర్తుల నియామకంలో కనీసం సామాజిక అంశాలు ముడిపడివున్నాయని అయినా ప్రభుత్వం వాదించుకోగలిగింది. అలాగే, హెబియస్ కార్పస్ పిటిషన్‌పై ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పారని 1977లో ఒక న్యాయమూర్తి సీనియారిటీని పరిగణనలోకి తీసుకోలేదు. కానీ ఇటీవల ముగ్గురు న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం తీసుకున్న నిర్ణయం పూర్తిగా మిస్టరీగా మారింది. ఈ ఎంపిక విధానాన్ని ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఒకరు తీవ్రంగా తప్పుపట్టారు కూడా! డిసెంబర్, జనవరి నెలల్లో కొలీజియం తీసుకున్న రెండురకాల నిర్ణయాలపై 'క్రిస్టమస్ ముందు ఒక నిర్ణయం, తరువాత మరో నిర్ణయం తీసుకోవడం సరికా'దనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడే మరో అంశం పరిశీలనలోకి తీసుకోవలసి ఉన్నది. డిసెంబర్ 12న సమావేశమైన కొలీజియం పూర్తి నిర్ణయం తీసుకోలేదని, విస్తృత సంప్రదింపులు జరపవలసి ఉన్నదని చెబుతున్నారు. 'కొన్ని నిర్ణయాలు' మాత్రం ఈ సమావేశం తీసుకున్నదని చెప్పడం చూస్తుంటే కొలీజియం నిర్ణయాలు తీసుకున్నదని స్పష్టమవుతోంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వానికి తెలియజేయవలసిన బాధ్యత కొలీజియంపై ఉన్నది. కానీ, ఈ బాధ్యతను గత కొలీజియం ఎందుకు నెరవేర్చలేకపోయిందో అంతుబట్టని అంశంగా తయారైంది. ఈ నియామకాల గురించి ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కైలాశ్ గంభీర్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు.

ఈ సమావేశంలో జాబితా రూపొందనలో తీసుకున్న నిర్ణయాలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ కాకపోవడం గమనార్హం. ఒకరకంగా కొలీజియం తన విధిని తాను నిర్వర్తించలేదని భావించడంలో పొరపాటు లేదని న్యాయనిపుణులు అంటున్నారు. అంటే తన విధిని నిర్వర్తించడంలో కొలీజియం విఫలమైందని భావించవచ్చునన్న మాట. మొదటి సమావేశంలో ఇద్దరు న్యాయమూర్తుల పేర్లను పరిశీలించినట్టుగా ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పుడు అసలు అసంపూర్తి చర్చల వివరాలు ఎలా బయటకు పొక్కాయో అంతుబట్టని విషయం. అసలు కొలీజియం విధానాన్ని సంపూర్ణంగా మార్చివేస్తూ 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకున్న నిర్ణయం అప్పట్లో అనేక విమర్శలకు, అభ్యంతరాలకు దారితీసిన విషయం విదితమే. కార్యనిర్వాహక వర్గం చెప్పిన దానికి న్యాయ విభాగం వ్యతిరేకించే పరిస్థితుల్ని, సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితిని బీజేపీ ప్రభుత్వం కల్పిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రంతో సంబంధం లేకుండా ఒక్క కొలీజియం మాత్రమే న్యాయవిభాగ స్వతంత్రను కాపాడగలదనేది నిర్వివాదాంశం. కొలీజియం వ్యవస్థలో అనేక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి నెలకొని ఉన్నది. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను ఒకేసారి భర్తీచేసే విధంగా కొలీజియం ఎందుకు చర్యలు తీసుకోలేకపోతోందో అర్థంకాని విషయం. ప్రభుత్వ జోక్యం వల్లనే ఇలా భర్తీ చేసే చర్యలు తీసుకోలేకపోతోందా అన్నది సందేహాస్పదంగా మారింది. ●



కుమారస్వామికి గండం: మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

మంచిమాట



నువ్వు ధైర్యంగా ఒక అడుగు ముందుకు వేస్తే విజయం పది అడుగులు ముందుకు వస్తుంది.

- రవీంద్రనాథ్ ఠాగూర్

విశ్వసనీయనేత వ్యూహాత్మక అడుగులు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెసేతర బీజేపీయేతర పక్షాన్ని అధికారంలోకి తీసుకురావడానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫెడరల్ యాత్ర చేపట్టడం వర్తమాన రాజకీయాల్లో చర్చనీయాంశం అవుతోంది. 17 సీట్లు కలిగిన తెలంగాణ రాష్ట్రం జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడం సాధ్యమవుతుందా? కేసీఆర్ వ్యూహమేమిటి కాంగ్రెస్ బీజేపీలకు ప్రత్యామ్నాయం సాధించడంలో ఆయన సఫలీకృతులవుతారా? ఏమి జరగబోతుంది అన్నది కొన్ని నెలల్లో తెలిసిపోతుంది. జాతీయ స్థాయిలో టీఆర్ఎస్ పార్టీ తన పాత్రను క్రియాశీలకంగా పోషించాలని, కీలకంగా రాణించాలని ఆయన చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం కావడానికి ఆయన వ్యూహాత్మకంగా కదులుతున్నారు. కేసీఆర్ తెలంగాణకే పరిమితమైన రాజకీయ నాయకుడు కాదు... దేశ రాజకీయాలను, వివిధ రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను దేశంలో వివిధ పార్టీల స్థితిగతులను చక్కగా అంచనా వేయగల నాయకుడు.

ఇటీవల దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినా తెలంగాణ ఎన్నికల ఫలితంపైనే జాతీయ స్థాయి మీడియా ఎక్కువ దృష్టి సారించింది. అనుమానాలన్నింటినీ పటాపంచలు చేస్తూ కేసీఆర్ సాధించిన ఘనవిజయం రాజకీయ విశ్లేషకుల్ని పండితుల్నే కాదు, టీఆర్ఎస్ క్యాడర్‌ను కూడా సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎనిమిది సార్లు శాసనసభకు, అయిదుసార్లు లోక్‌సభకు ఎన్నికై రికార్డు సృష్టించారు. కేసీఆర్‌కు మాత్రమే ఈ విజయాలు ఎలా సాధ్యమవుతున్నాయి అంటే ఆయన పట్టుదల, విశ్వసనీయత, ఏదైనా సాధిస్తారనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకుపోవడమే ప్రధానకారణం.

అనేక అవమానాలు, సందేహాల మధ్య గుప్పెడు మందితో 2001 ఏప్రిల్ 27న ప్రారంభమైన గులాబీ పార్టీ నేడు తెలంగాణలో అతిపెద్ద పార్టీగా మరోసారి అధికారం దక్కించుకోవడం ఆశ్చర్యమే! ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించి ఉప ప్రాంతీయ పార్టీగా తెలంగాణలో కొన్ని జిల్లాలు, కొంత ప్రాంతానికే పరిమితం అన్న విమర్శలు ఎదుర్కొన్న పార్టీ నేడు ముందస్తు అడుగులు వేస్తూ జాతీయ ప్రధాన పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేయడం అద్భుతమే!

2001లో అప్పటి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ సంస్థను రాజకీయ పార్టీగా ప్రకటించిన నాటి నుంచి నేటి వరకు పార్టీలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ఎన్ని పరిణామాలు సంభవించినా, ఎన్ని కుట్రలు జరిగినా ఇంతింతై వటుడింతై అన్నట్టుగా అంచెలంచెలుగా ఎదుగుతూ అప్రతిహతంగా కొనసాగడం అభినందించాల్సిందే! గతం పునాదులపై వర్తమానాన్ని బేరీజు వేసుకుంటూ భవిష్యత్ గురించి ఆలోచించేవాడే ఏ రంగంలోనైనా విజయం



> రాజకీయ నాయకుడు తన అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే గతం, వర్తమాన పరిస్థితులే కాదు భవిష్యత్ పరిణామాన్ని పసిగట్టి అందుకు అనుగుణంగా వ్యూహాల్ని రచించాలి. ఆ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కాబట్టే వరుస విజయాలు కేసీఆర్ సొంతమవుతున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్ని సీట్లు సాధిస్తుందో ఇప్పుడే చెప్పలేం. కానీ రాబోయే జాతీయ ప్రభుత్వంలో కేసీఆర్ మాత్రం కీలక పాత్ర పోషిస్తారని చెప్పవచ్చు.

సాధిస్తాడు. అలాంటి కోవకు చెందినవాడే కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలనే ఆకాంక్ష ఇక్కడి ప్రజల్లో ఎంతగా ఉందో పసిగట్టి నివురుగప్పిన నిప్పులా ఉన్న పరిస్థితిని అంచనావేసి జాతీయ పార్టీల పరిస్థితులు, స్థానికంగా చంద్రబాబు స్థితిని గమనించి తెలంగాణ జెండా ఎత్తుకున్నారు.

2001లో పార్టీ స్థాపించడానికి ముందు కవులు, కళాకారులు మేధావులు వివిధరంగ నిపుణులతో ఆయన వందల గంటల కొద్దీ జరిపిన చర్చలు.... పార్టీ స్థాపించడమే కాదు దానిని ఏ రకంగా నిర్మాణం చేసుకోవాలి నిలబెట్టుకోవాలి కొనసాగించాలనే ముందస్తు వ్యూహాన్ని రచించుకొని పార్టీ ఏర్పాటు ప్రకటన చేశారు. త్యాగాల పునాదుల మీదుగానే తెలంగాణను సాధిస్తామని ప్రకటించి, డిప్యూటి స్పీకర్ పదవికి, శాసనసభ్యత్వానికి ఆనాడు చేసిన రాజీనామా ఆయనలో నిబద్ధతను చాటింది. ఎన్నికలు రాజకీయాలు, ఉప ఎన్నికలు, ఎన్నికల మధ్య పొత్తులు ఎత్తులతో తెలంగాణ అంశాల్ని జాతీయ రాజకీయ స్రవంతిలో ప్రధానంగా ఉండే విధంగా స్థానికంగా పార్టీ ఎదిగేలా ప్రయత్నిస్తూ బలం పెంచుకుంటూ ముందుకెళ్ళారు. కేవలం ఇద్దరు పార్లమెంట్ సభ్యులు ఉన్న పార్టీ కేంద్ర ప్రభుత్వంలో చలనం తీసుకువచ్చి రాష్ట్రాన్ని సాధించడం సాధించుకున్న రాష్ట్రంలో ఏ పార్టీతో పొత్తు లేకుండా ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఒక సంచలనమే!

అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీని ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించడం, రాజకీయ కోణంలో ఆలోచిస్తూ తలసాని, తుమ్మలతో పాటు టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ శాసనసభ్యులను, పార్లమెంట్ సభ్యులను చేర్చుకుని ఆ పార్టీలకు 'వాయిస్' లేకుండా చేయడం కేసీఆర్ రాజకీయ చతురతను తెలియజేస్తుంది. సంక్షేమ పథకాల పేరిట సబ్బండ జాతులకు దగ్గరయ్యే ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు. ముందస్తు వ్యూహంతో పక్కా ప్రణాళికతో ఎన్నికల్లో మరోసారి అధికారం సాధించి తన సత్తాను చాటారు. రాజకీయ పార్టీ ఎలాగైనా విజయం సాధించాలనుకొంటుంది. దానికోసం ఎన్ని ఎత్తుగడలైనా వేస్తుంది. తన బలాన్ని బలగాన్ని ప్రదర్శించడమే కాకుండా ఎదుటి వారి లోపాల్ని పసిగట్టి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది. తెలంగాణా ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ ప్రజలకు చేరువయ్యే విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2014 తరువాత జరిగిన ప్రతి ఎన్నికల్లో ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చారు. పార్టీని పెంచాలి, విస్తరించాలనే ఆలోచనతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు ఆయన సాధించిన విజయాల నుంచి రాజకీయ పార్టీలు చూసి నేర్చుకోవాలి. ప్రతిపక్ష పార్టీలు కూటమి కట్టినా క్షేత్రస్థాయిలో వ్యతిరేకత ఉందని ఎంతో ప్రచారం చేసినా ఆయన పార్టీ సాధించిన సీట్లు ఓట్లలో సగం కూడా సాధించలేకపోయారు.

పట్టుపట్టరాదు... పడితే విడువరాదు. అన్న నైజం కేసీఆర్‌ది. తెలంగాణలో తిరుగులేని నేతగా ఎదిగిన కేసీఆర్ చెబితే ఏదైనా చేస్తారు. సాధించి చూపెడతారనే నమ్మకం ప్రజల్లో బలంగా నాటుకొంది. కేసీఆర్ పట్ల ప్రజలకున్న విశ్వసనీయత నిదర్శనమే ఈ ఫలితాలు. అతి కొద్దిమందితో ప్రారంభమై అప్రతిహతంగా అతిపెద్ద పార్టీగా అవతరించడం ఏకకాలంలో రాష్ట్ర రాజకీయాల్లో జాతీయ రాజకీయాల్లో కేసీఆర్ వేస్తున్న 'ముద్ర' చెరగనిది. విమర్శకులు సైతం మెచ్చుకునే నాయకుడు కేసీఆర్. తెలంగాణలో తన పార్టీకి సుస్థిరతను సాధించడం తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీని రాష్ట్ర స్థాయిలోనే కాదు జాతీయ స్థాయిలో అధికారంలోకి రాకుండా నిలువరించడం ఆయన ప్రధాన వ్యూహంగా తోస్తుంది. రాజకీయ నాయకుడు తన అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే గతం, వర్తమాన పరిస్థితులే కాదు భవిష్యత్ పరిణామాన్ని పసిగట్టి అందుకు అనుగుణంగా వ్యూహాల్ని రచించాలి. ఆ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి కాబట్టే వరుస విజయాలు కేసీఆర్ సొంతమవుతున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎన్ని సీట్లు సాధిస్తుందో ఇప్పుడే చెప్పలేం. కానీ రాబోయే జాతీయ ప్రభుత్వంలో కేసీఆర్ మాత్రం కీలకపాత్ర పోషిస్తారని చెప్పవచ్చు.

◆ సురేష్ కాలేరు
9866174474

పంచాయతీ సమరం ప్రారంభం

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పల్లెలన్నీ సందడిగా మారాయి. నిత్యం అభ్యర్థుల ప్రచారంతో హోరెత్తి పోతున్నవి. గెలిచాక ఇది చేస్తాం.. అది చేస్తం అంటూ ఓటర్ల మనస్సు గెలిచేందుకు ప్రయత్నిస్తుండటం గమనార్హం. ఏది ఏమైనా ఖచ్చితంగా గెలిచి తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని కాంక్షతో ఉన్నారు. పల్లెల్లో పంచాయతీ పోరు మొదలైంది. మూడు విడతలుగా జరిపేందుకు ఎన్నికల కమిషన్ సన్నద్ధమవుతోంది. అప్పుడే ఎన్నికల సామాగ్రి సంబంధిత ఆఫీసులకు చేరవేస్తున్నారు. చాలావరకు పల్లెల్లో ఆశావహులు నేతల చుట్టూరా మద్దతు కోసమని ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆశావాహులు అందరూ కావలసినవారు కావడంతో మీరే నిర్ణయం తీసుకోవాలని చెప్పడంతో వెనుదిరిగి రాక తప్పడం లేదు. ఎవరు చెప్పినా వినరు. బరిలో ఉండక తప్పదు అంటూ ఎవరికి వారే అనుచరులతో ఊరంతా ఇంటింటా తిరుగుతున్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి. గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని అభ్యర్థులు ఓటర్లని అభ్యర్థించడం మొదలెట్టారు. వాస్తవానికి ముందస్తు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సదరు ఆశావహులు అప్పుడే సందట్లో సడేమియా తమ పనిని కానిచ్చుకోవడం విశేషం. జనాల దృష్టిలో పడేందుకు అప్పుడే పంచాయతీ పోరు జరుగుతున్నట్లుగా ప్రచారాన్ని చేయడం విశేషం. ముందస్తు వేరు పంచాయతీ పోరు వేరు. తమ నియోజకవర్గపు అభ్యర్థి గెలుపు కోసం పార్టీ తరపున గ్రామాల్లో అందరూ శ్రమించాల్సి వస్తుంది. కానీ ఇక్కడ జరుగుతుంది గ్రామ పోరు. పంచాయతీ ఎన్నికలు జరిగేవి పార్టీపరంగా కాదు. కానీ ప్రస్తుతం చూస్తుంటే ఇతను ఫలానా పార్టీ అతడు ఫలానా పార్టీ అని చెప్పుకోవడం జరుగుతోంది. పార్టీకి సంబంధం లేనివారు బరిలో ఉంటే ఇండిపెండెంట్ అంటారు. మిగతా వారిని అలా అనలేం ఎందువల్ల అంటే ఏదో ఒక పార్టీకి చెందిన వ్యక్తిగానే పరిగణించాల్సి వస్తుంది. ఇక పోరు విషయానికి వస్తే అభ్యర్థులు ఎవరికి వారు గ్రామాల్లో ప్రచారంలో మునిగి పోయారు. సంఘాలు, కులాల వారీగా తమ బలాన్ని నిరూపించుకునేందుకు నిత్యం వారితో.. గెలిస్తే తాము చేయబోయే పనులను గూర్చి వివరిస్తున్నారు. అవకాశం ఇచ్చి చూడండి ఐదు సంవత్సరాల్లో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తాం అంటున్నారు. చదువుకున్న వ్యక్తిగా యువకునిగా గ్రామానికి సేవ చేయాలనే తపనతో ముందుకు వస్తున్నానని, తనను ఆశీర్వ దించాలని యువకులు కోరుతున్నారు. ఈసారి గ్రామాల్లో పెద్దలకు యువకుల పోటీ తప్పేలా లేదు. అంతగా ఆసక్తి గల యువత కచ్చితంగా రాజకీయాల్లోకి రావాలి. తాము కలలు కంటున్న గ్రామాలుగా తీర్చిదిద్దడంలో తమ పాత్ర ఉండటం మంచిదే. నేటి సర్పంచియే భవిష్యత్తులో నియోజకవర్గానికి ఎమ్మెల్యే కావచ్చు. అలా అయిన వారు లేకపోలేదు. సర్పంచ్ అభ్యర్థిగానే కాకుండా యువకులు, యువతులు ఒకడుగు ముందుకేసి వార్డుసభ్యులుగా ఉండటానికి ఇష్టపడుతున్నారు. తమతమ వార్డులను బాగు పరు చుకోవడానికి ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయం. వార్డులు మెరుగవుతేనే గ్రామాలు ఉత్తమంగా తయారవుతాయి. గ్రామాలు మొత్తానికి యువత, పెద్దల పాలనతో అభివృద్ధికి నాంది పలుకుతాయి అన్నమాట. ఇంకా చెప్పాలంటే ఇక నుంచి ఉప సర్పంచ్‌కి కూడా చెక్ పవర్ ఉంటుంది అనడంతో దానికి పోటీ తీవ్రంగా ఉండేలా అగుపిస్తోంది. ఇప్పటి నుంచే సదరు ఆశావహులు దానిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఏది ఏమైనా గ్రామాలను అభివృద్ధి పరిచి గాంధీజీ కలలు కన్న గ్రామాలుగా తీర్చిదిద్దాలి. అప్పుడే పల్లె మురిసిపోతోంది.

◆ అనంతవరం సిద్దిరామప్ప
9676179196



ఆడ శిశువును

కవిత

ఆడ శిశువును
అమ్మ కడుపులో నేను ముద్దయినప్పుడు
ఎన్నో జన్మల పుణ్య ఫలమనుకున్నాను
అమ్మ గర్భంలో వెచ్చని ప్రేమ పంచినప్పుడు
ఎన్నో నోముల కలల పంటనుకున్నాను
అమ్మ నవమాసాల నా బరువు
మోస్తున్నప్పుడు
విశ్వాన్ని గెలిచినంత సంబరపడ్డాను.

నా రూపాన్ని మీరు చూడకుండానే
ఏ పాపం చేశానని నా గొంతులో
వడ్ల గింజ వేసి చంపుతున్నారు

నా మనస్తత్వం తెలియకుండానే
ఏ పశుతత్వంతో నన్ను చులకన
చేసి వీధిపాలు చేస్తున్నారు

కొత్త ప్రపంచము పరిచయం కాకుండానే
ఏ మానవత్వంతో నన్ను గర్భాశయం
నుంచి తొలగించి వేస్తున్నారు

అమ్మా .....
ఈ నేటి కలియుగానికి
రావాలని లేదమ్మా

ఏ పాపం తెలియని రక్త
మాంసాల మధ్య
నులివెచ్చగా ఉంటానమ్మా

బయట ప్రపంచం కన్నా ఈ
గర్భంలో వెచ్చగా ఉందమ్మా

ఇన్ని కుతంత్రాల మధ్య
నా బ్రతుకు భారమే కదా?

నవమాసాలు మోస్తున్న అమ్మ
నేను ఎలా రావాలో చెప్పమ్మా
రావాలని ఉన్నా రాలేని ఓ ఆడ
శిశువైనా గర్భస్థ పిండాన్ని

- కమ్మరి శ్రీనివాసచారి
9177324124

యువతకు ఉపాధి కోసం కొత్త ఆవిష్కరణలు



జాతీయ యువజనోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగంలో ప్రధాన మంత్రి, 'మన యువత ఉపాధి కల్పించేవారుగా ఉండాలేగానీ, ఉపాధిని కోరుకునే వారుగా కాదు' అన్నారు. ప్రపంచంలో యువజనం అత్యధికంగా ఉన్న దేశం భారత దేశం, దేశ జనాభాలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సులు 28 శాతం. జాతీయ యువజన విధానం 2014 నిర్వచిస్తుంది. యువశక్తిని సమర్థంగా సమీకరిస్తే భారతదేశం ప్రపంచ నైపుణ్య రాజధానిగా కాగలదు. అయితే స్వల్ప విద్యాస్థాయి - నైపుణ్యం, చదువుకు స్వస్తి, మధ్యలో విరామం తీసుకున్న వారి శాతం అధికంగా ఉండటంతో పాటు ఆర్థిక కార్యకలాపాల ప్రాంతాల వారి పంపిణీలో భిన్నత్వం కూడా భారత యువత ఉపాధి సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. 15-17 వయసులో యువత అధిక శాతం వ్యవసాయ రంగం వైపు దృష్టిని బట్టి స్వల్ప నైపుణ్య ఉపాధి ఎంపికకు గల ప్రాధాన్యం స్పష్టమవుతుంది. ఈ విషయంలో నిర్మాణ రంగాలు తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఆ తరువాత 18-29 ఏళ్ల మధ్యలో మీరు వ్యాపారం మరమ్మతుడలు; రవాణా రంగాల వైపు వెళుతుండగా ఈ వయసు వారు ఎంపిక దృష్ట్యా కూడా వ్యవసాయరంగ ఆధిపత్యమే కనిపిస్తున్న నిర్మాణ, తయారీ రంగాలు తదుపరి స్థానంలో ఉన్నాయి. అంతే కాకుండా విద్యార్హతల మెరుగుతో నిరుద్యోగ శాతం పెరుగుదల కనిపిస్తుంది. పట్టభద్రులు, అంతకన్నా ఎక్కువ స్థాయి విద్యాభ్యాసం చేసిన వారి విషయంలో నిరుద్యోగ శాతం అధికంగా 18.4 శాతం కాగా, ప్రాథమిక విద్య స్థాయిలో చూస్తే అత్యంత తక్కువ 3 శాతం మేర నమోదయింది. యువతరంలోని 15 నుంచి 29 ఏళ్ల వయస్సు గల వారిలో అత్యధికంగా 85 శాతం సాధారణ విద్యాభ్యాసం వైపు మొగ్గు చూపుతుండగా 12.6% మాత్రమే సాంకేతిక, వృత్తివిద్యల వైపు వెళుతున్నారు. ఇక ఉపాధి విద్యను అభ్యసిస్తున్నవారు 2.4 శాతం మాత్రమే. ఉపాధి సామర్థ్యం తక్కువగా ఉండడానికి గల కారణాల్లో ఇది కూడా ఒకటని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కార్మిక శక్తిలో 8 శాతానికి మాత్రమే పరిమితమైన ఉపాధి కల్పన పెంచవలసిన అవసరం ఉంది. యువత స్వల్ప చెల్లింపు రంగాల వైపు వెళ్లి పేద కార్మికులుగా మిగిలిపోకుండా చూడాలంటే యువతకు ఇదొక్కటే మార్గం. యువతను ఉపాధి సామర్థ్యం సంతరించుకోగల నైపుణ్య అభ్యాసం వైపు మళ్లించే విద్యా సంస్థలుగా రూపొందాలి. ఇందులో భాగంగా విద్యార్థి దశలోనే యువతను ఆవిష్కరణల దిశగా నడిపేందుకు అటల్ అనుసంధాన ప్రయోగ శాలను కూడా దీని కింద ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వేలాది సంస్థలను ప్రోత్సహించేందుకు అటల్ పోషక కేంద్రాలను నెలకొల్పింది. ఉపాధి అవకాశాలు సృష్టికి, ఆవిష్కరణల ఉత్తేజానికి తద్వారా వృద్ధికి ఊతం ఇవ్వడంలో వ్యవస్థాపన ఒక ముఖ్యమైన చోదకం. ఈ నేపథ్యంలో వ్యవస్థాపన స్ఫూర్తిని ప్రోత్సహించడంలో భాగంగా జనం ఆలోచన ధోరణులను మార్చడానికి కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి భారీ సంఖ్యలో అనేక చర్యలు చేపట్టింది.

సాంకేతిక విప్లవం జీవనోపాధిని ప్రభావితం చేయడానికి చాలాముందు నుంచే మొదలైంది. సేవారంగం డిజిటల్ సాంకేతికతను అందిపుచ్చుకోవడం వల్ల యువశక్తిలో అధిక భాగం ఆ రంగంలో అవకాశాల వైపు చూస్తుంది. నైపుణ్య శిక్షణతో పాటు జనశక్తి సానుకూలతను సొమ్ము చేసుకోవడంలో భారత్ సవాళ్లను ఎదుర్కొంటోంది. నాలుగో పారిశ్రామిక విప్లవంగా విసరిస్తున్న నేటి డిజిటల్ యుగంలో ప్రస్తుత ఉద్యోగ అవసరాల విస్తరణ సహా సరికొత్త ఉద్యోగ పాత్రలు నైపుణ్యాల్లో చోటు చేసుకున్న మార్పులు కూడా ఇందుకు కారణం. సకల రంగాల్లోనూ అన్ని రకాల ఉద్యోగ పాత్ర పోషణ ఏకీకృతమైన రాబోయే కాలంలో రంగాల వారీగా ఉద్యోగ విభజన రూపు మాసిపోయిన, ఐటి ఏకీకృత ఉద్యోగ పాత్ర పోషణకు భవిష్యత్ అవకాశాలు ఎక్కువగా ఉండవచ్చును. తయారీ రంగం ఇప్పటికే ప్రధాన ఉత్పాదనకు పరిమితమై అనుబంధ ఉత్పాదకత కార్యకలాపాలకు సంబంధించిన ఇతర ఉద్యోగాలు సంస్థ వెలుపలికి అంటే సేవారంగంలోకి బదిలీ అవుతున్నాయి. భారీ గణాంక విశ్లేషణ ప్రకారం కృతిమ మేధస్సు, రోబో ప్రక్రియ పూరిత యాంత్రీకరణ, ఇంటర్నెట్ ఆధారిత కార్యకలాపాలు, క్లౌడ్ కంప్యూటింగ్, విద్యుత్ వాహనాలు వంటి వాటిలో అత్యంత నైపుణ్యం, అత్యధిక వేతనం ఉద్యోగాలు భవిష్యత్తులో సృష్టించబడతాయి. అయితే ఆహార పరిశ్రమ, దుస్తుల తయారీ, జౌళి, పర్యాటక-ఆతిథ్య, నిర్మాణ రంగాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాంకేతికత ఆధారంగా విద్యార్హతలు పెద్దగా లేని కార్మిక శక్తి అవకాశాలు ఉంటాయి. ప్రభుత్వం చేపట్టిన ఎన్నో చర్యలు స్టార్ట్ అప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర, స్వచ్ఛభారత్ వంటివి కూడా స్వల్ప నైపుణ్యం గల కార్మిక శక్తికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం అత్యధికంగా పెట్టుబడి పెడుతున్న రంగాలు పెట్టుబడులను ప్రోత్సహించే విధానపరమైన చర్యలు తీసుకుంటోంది. ఉదాహరణకు ఆహార ఉత్పత్తులు, వ్యవసాయం, మౌలిక వసతులు, ఆటోమోటివ్, జౌళి, ఇతర రంగాలు ప్రస్తుత కార్మిక విపణిలోకి ప్రవేశించి కొత్త కార్మిక శక్తి కోసం కూడా కొత్త యువతకు ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తున్నాయి.

◆ డాక్టర్ పుల్లయ్య దూదేకుల
9490402696



మూడో రోజూ లాభాల ముగింపే..

ఆద్యంతం ఒడుదుడుకులకు లోనైన ఇండెక్స్‌లు

- ఒకానొక సమయంలో నష్టాల్లోకి జారుకున్న సూచీలు
- చివరకు 53 పాయింట్ల లాభంతో 36,374కు సెన్సెక్స్
- 15 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 10,905 వద్ద ముగింపు
- సన్ ఫార్మా 6 శాతం డౌన్

ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ గురువారం లాభాల్లోనే ముగిసింది. ఇండెక్స్‌లు లాభపడటం ఇది వరుసగా మూడో రోజు. అమెరికా మార్కెట్ల లాభాల ముగింపు నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఆరంభం నుంచే లాభాల్లోకి వెళ్లాయి. అయితే తర్వాత ఇండెక్స్‌లు ఆద్యంతం ఒడిదుడుకులకు లోనయ్యాయి. చివరకు సూచీలు స్వల్ప లాభంతో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 53 పాయింట్లు లాభపడి 36,374 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 15 పాయింట్లు లాభపడి 10,905 వద్ద ముగిసింది.

యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్ షేర్ల ర్యాలీ దన్నుతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 27,500 పాయింట్లపైన ముగిసింది. డాలర్ మారకంలో రూపాయి బలహీనత ఐటీ షేర్లకు కలిసి వచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ ర్యాలీతో ఫైనాన్స్ సర్వీసెస్ ఇండెక్స్ అర శాతం మేర లాభపడింది.



ఇంట్రాడేలో అధిక వెయిటేజీ ఉన్న ఇన్ఫోసిస్, యస్ బ్యాంక్, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడితో సూచీలు ఆరంభంలో ఆర్జించిన లాభాల్ని కోల్పోయాయి. సన్ ఫార్మా 6 శాతం మేర పతనమైంది. అలాగే అంతర్జాతీయ బలహీన పరిస్థితుల కారణంగా మార్కెట్‌లో అమ్మకాలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో సూచీలు మిడ్‌సెషన్ సమయానికల్లా నష్టాల్లోకి జారుకున్నాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ 150 పాయింట్లను కోల్పోయి 36,171 వద్ద, నిఫ్టీ 46 పాయింట్లు నష్టపోయి 10,844 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు పతనమయ్యాయి.

చివరి గంటలో జరిగి షార్ట్ కవరింగ్ సూచీలను నష్టాల ఊబి నుంచి బయట పడేశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, ప్రైవేట్ రంగ బ్యాంకులైన యాక్సిస్ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఐటీ రంగానికి చెందిన టీసీఎస్ షేరు ర్యాలీ సూచీలను తిరిగి లాభాల్లోకి తెచ్చాయి. అలాగే రియల్టీ, ప్రైవేట్ ఇండెక్స్‌లు సైతం లాభాల్లో ముగిశాయి. మరోవైపు ప్రభుత్వ రంగ బ్యాంక్, ఫార్మా రంగాలకు చెందిన ఇండెక్స్‌లు 1.50 శాతం నష్టంతో ముగిశాయి. హెచ్‌యూఎల్ ఫలితాల నేపథ్యంలో ఎఫ్ఎంజీసీ ఇండెక్స్ అరశాతం నష్టపోయిగా, మెటల్ ఇండెక్స్ సైతం అరశాతం క్షీణించింది.

లాభం అదిరింది.. షేరు పడింది

- రూ.1,444 కోట్లుగా నమోదు
- రూ.9,558 కోట్లకు పెరిగిన ఆదాయం
- వార్షిక ప్రాతిపదికన 11 శాతం వృద్ధి
- మార్కెట్ అంచనాలు మించిన అమ్మకాలు

న్యూఢిల్లీ: దిగ్గజ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్తాన్ యూనిలివర్ (హెచ్‌యూఎల్) తాజాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో (క్యూ3) త్రైమాసికపు ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9 శాతం పెరిగింది. రూ.1,444 కోట్లుగా నమోదయ్యింది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం



ఇదే క్వార్టర్‌లో రూ.1,326 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

హెచ్‌యూఎల్ ప్రస్తుత క్వార్టర్‌లో రూ.9,558 కోట్ల ఆదాయాన్ని అర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలోని ఆదాయం రూ.8,590 కోట్లతో పోలిస్తే 11 శాతం పెరుగుదల కనిపించింది. కంపెనీ అమ్మకాలు 10 శాతం మేర పెరిగాయి. ఇవి మార్కెట్ వర్గాల అంచనాలు మించాయి. విక్రయాల పెరుగుదల 6 నుంచి 8 శాతం శ్రేణిలో ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి.

కంపెనీ ఈబీటా 22 శాతం పెరుగుదలతో రూ.2,046 కోట్లకు ఎగసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో ఈబీటా రూ.1,680 కోట్లుగా నమోదయ్యింది. ఇక నిర్వహణ మార్జిన్లు 19.6 శాతం నుంచి 21.4 శాతానికి పెరిగాయి. అదే సమయంలో కంపెనీ పన్ను వ్యయాలు రూ.297 కోట్ల నుంచి రూ.510 కోట్లకు ఎగశాయి. క్యూ3 ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో హెచ్‌యూఎల్ షేరు ధర ఎన్ఎస్ఈలో 1.19 శాతం క్షీణతతో రూ.1,751 వద్ద ముగిసింది.

బంగారం భళా.. వెండి డీలా

- నాలుగో రోజూ పసిడి పరుగులు

న్యూఢిల్లీ: పసిడి ధర పెరుగుతూనే వెళ్తోంది. దేశీ మార్కెట్ వరుసగా నాలుగో రోజు బంగారం ధర పెరిగింది. పది గ్రాముల బంగారం ధర రూ.110 పెరుగుదలతో రూ.33,300కు చేరింది. దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ పెరగడం, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు ఇందుకు కారణం. అయితే వెండి ధరలు మాత్రం తగ్గాయి. కేజీ వెండి ధర రూ.300 తగ్గుదలతో రూ.40,200కు క్షీణించింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల నుంచి డిమాండ్ మందగించడం ఇందుకు కారణం.



సానుకూల అంతర్జాతీయ పరిస్థితులు, దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ పెరగడం వంటి అంశాలు బంగారంపై సానుకూల ప్రభావం చూపాయని ట్రేడర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 1,292.55 డాలర్లకు పెరిగింది. వెండి ధర ఔన్స్‌కు 15.57 డాలర్ల వద్ద ఉంది.

ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.110 పెరుగుదలతో రూ.33,300కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.110 పెరుగుదలతో రూ.33,150కు చేరింది. గత మూడు రోజుల్లో బంగారం ధర రూ.315 మేర పెరిగింది. ఇక ప్రభుత్వ సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ.100 పెరుగుదలతో రూ.25,500లకు చేరింది. కేజీ వెండి ధర రూ.300 తగ్గుదలతో రూ.40,200కి క్షీణిస్తే.. వారాంతపు ఆధారిత డెలివరీ ధర రూ.143 తగ్గుదలతో రూ.39,690కి క్షీణించింది. ఇక 100 వెండి నాణేల కొనుగోలు, అమ్మకం విషయానికి వస్తే.. కొనుగోలు ధర రూ.77,000 ఉండగా.. అమ్మకం ధర రూ.78,000గా స్థిరంగా కొనసాగాయి.

ఒక్క రోజులోనే ఐటీ రిటర్నుల ప్రాసెసింగ్..

- కొత్తగా పోర్టల్ 2.0కు రూపకల్పన
- 18 నెలల్లో పూర్తికానున్న ప్రాజెక్ట్
- ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు బాధ్యతలు
- వ్యవస్థ అమల్లోకి వస్తే రిఫండ్ ప్రక్రియ కూడా వేగవంతం



న్యూఢిల్లీ: ఐటీ రిటర్నులను 24 గంటల్లో ప్రాసెసింగ్ చేయడానికి కేంద్రం కసరత్తు ప్రారంభించింది. ఆదాయపు పన్ను రిటర్నులను ప్రాసెస్ చేయటంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడానికి అడుగులు వేస్తోంది. ఇందుకు సంబంధించి రూ.4,242 కోట్ల ఆదాయపు పన్ను (ఐటీ) ఫైలింగ్ ప్రాజెక్ట్‌కు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టు డెవలపర్‌గా ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేసింది. ప్రాజెక్టు 18 నెలల్లో పూర్తవుతుంది. మూడు నెలలు ప్రాజెక్టు పరీక్షా సమయం. అటు తర్వాత పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ చెప్పారు.

ప్రస్తుతం రిటర్నులు ఫైల్ చేసిన తర్వాత ప్రాసెసింగ్ సమయం 63 రోజులు పడుతోందని పియూష్ గోయెల్ తెలిపారు. తాజా వ్యవస్థ అమలోకి వచ్చిన తర్వాత ఈ సమయం కేవలం 24 గంటలకు తగ్గిపోతుందన్నారు. దీనితో రిఫండ్ ప్రక్రియ కూడా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

క్యాబినెట్ ఆమోదముద్ర వేసిన ఆదాయపు పన్ను శాఖ ఇంటిగ్రేటెడ్ ఈ ఫైలింగ్ అండ్ సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ 2.0 ప్రాజెక్టు రూపకల్పనకు బిడ్డింగ్ ప్రాసెస్‌లో ఇన్ఫోసిస్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థ విజయవంతమైనదే అయినప్పటికీ, తాజా వ్యవస్థ మరింత ట్యాక్స్ ఫ్రెండ్లీ వాతావరణాన్ని స ష్టిస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి పారదర్శకతనూ పెంపొందిస్తుంది. అన్ని స్థాయిల్లోనూ ఆటోమేషన్ సౌలభ్యం ఏర్పడుతుంది. ఆదాయపు పన్ను శాఖ ప్రమేయం ఏమాత్రం లేకుండా పన్ను చెల్లింపుదారుల అకౌంట్‌లోకి డైరెక్ట్‌గా రిఫండ్స్ జారీ అవుతాయి.

ప్రస్తుత సీపీసీ-ఐటీఆర్ 1.0 ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరానికి క్యాబినెట్ మరో రూ.1,482 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకూ రూ.1.83 లక్షల కోట్ల రిఫండ్స్ జరిగాయి.

వోక్స్‌వ్యాగన్‌కు ఎన్‌జీటీ షాక్

- వోక్స్‌వ్యాగన్ వాహనాల్లో 40 రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్

న్యూఢిల్లీ: జర్మన్ కార్ల తయారీ సంస్థ వోక్స్‌వ్యాగన్‌కు ఊహించని షాక్ తగిలింది.. తప్పుడు డీజిల్ మీటర్లతో వినియోగదారులను మోసం చేశారంటూ దాఖలైన కేసుకు సంబంధించి న్యూఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) రూ.100కోట్లు చెల్లించాలని సూచించింది. ఒక్క 2006 ఏడాదిలోనే దాదాపు 3.17లక్షల వాహనాల ద్వారా వాస్తవానికంటే 40రెట్లు నైట్రస్ ఆక్సైడ్స్ దుదల చేసిందన్న ఫిర్యాదుపై 24 గంటలలోగా సెంట్రల్ కాలుష్య నియంత్రణ బోర్డుకు జరిమానా సొమ్మును డిపాజిట్ చేయాలని గురువారం ఆదేశించింది. లేని పక్షంలో సంస్థ భారత్ విభాగం ఎండీని అరెస్టు చేయడంతోపాటు సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ ఆదర్శ్ కుమార్ నేతృత్వంలోని నలుగురు సభ్యులు బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.



ప్రపంచవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలపై , అనేక కేసులను ఎదుర్కొంటున్న వోక్స్ వ్యాగన్ ఇండియా భారతదేశంలో కూడా వాహనాల్లో నైట్రస్ ఆక్సైడ్ను అనుమతించదగిన పరిమితులను అధిగమించి వాడిందని, తద్వారా ఢిల్లీ నగరంలో అటు పర్యావరణానికి ఇటు ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించిందని తెలిపింది.

కాగా ఈ కేసులో 171.34 కోట్ల రూపాయలను చెల్లించాల్సిందిగా గత ఏడాది నవంబరు 16న ఆదేశించింది. ఈ విషయాన్ని దర్యాప్తు చేయడానికి నిపుణుల బ ందాన్ని ఏర్పాటు చేసింది. ఆరోపణలను సమర్థించిన కమిటీ జరిమానా విధించాలని సిఫార్సు చేసింది. కానీ సంస్థ జరిమానా సొమ్మునుజమలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన100కోట్ల రూపాయలను చెల్లించాల్సిందిగా తాజా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు తమ వాహనాలు దేశంలో స్టేజ్4 నిర్దేశించిన ఉద్గార నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని వోక్స్‌వ్యాగన్ ఇండియా పేర్కొంది.

బీమా పత్రాలు పోగొట్టుకుంటే?

పాలసీలకు చెందిన ప్రీమియంలు క్రమపద్ధతిలో చెల్లించడం ఎంత ముఖ్యమో.. ఆయా పాలసీల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచడం కూడా అంతే ముఖ్యం. ఎన్నో ఆశలు పెట్టుకుని అంతో ఇంతో డబ్బులు జమచేస్తూ నిర్వహిస్తున్న జీవితబీమా పాలసీలు ఎప్పుడైనా ప్రమాదవశాత్తు, అనుకోని పరిస్థితుల్లో కనపడకుండా పోతే ఎలాంటి చిక్కులు ఏర్పడతాయి? పోయిన పాలసీ పత్రాలను ఎలా తిరిగి సంపాదించాలి? అందుకు ప్రత్యామ్నాయ మార్గాలేమిటి? కుటుంబానికి భరోసాగా నిలిచే జీవితబీమా పాలసీల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?



వ్యక్తిగత బీమా అనేది.. పాలసీ తీసుకున్న వ్యక్తులకే కాదు, ఆ వ్యక్తికి సంబంధించిన మొత్తం కుటుంబానికి ఆ పాలసీ ఆపద సమయంలో భరోసాగా నిలుస్తుంది. అంటే అనుకోని ఆరోగ్య సమస్యలు, ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు కుటుంబాన్ని ఆదుకునేది జీవితబీమానే. అయితే తెలిసో తెలియకో చేసే చిన్న పొరపాటువల్ల అవసరమయ్యే సమయాల్లో అది అక్కరకు రాకుండా పోతోంది. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు పాలసీ వివరాలు తెలపకపోవడం, పాలసీ పత్రాలు పోగొట్టడంలాంటివే దీనికి కారణమవుతున్నాయి. ఒకవేళ పాలసీదారులకు ఎవరికైనా ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఏం చేయాలి? పాలసీ వివరాలను ఎలా తెలుసుకోవాలో తెలుసుకుందాం!

ఒప్పందం-సాక్ష్యం

బీమా సంస్థ, పాలసీదారుడికి మధ్య కుదిరిన ఒప్పందానికి సాక్ష్యం బీమా పత్రం (పాలసీ డాక్యుమెంట్). పాలసీ వివరాలు, చెల్లించాల్సిన ప్రీమియం, ఎంత పరిహారం ఇవ్వాలి? నామినీ ఎవరు? తదితర అనేక అంశాలు ఈ పత్రంలో ఉంటాయి. పాలసీ నుంచి రుణం తీసుకోవాలన్నా, పాలసీ వ్యవధి ముగిసిన తర్వాత లేదా పాలసీని మధ్యలోనే నామినీ క్లెయిం చేసుకోవాల్సి వచ్చినా ఈ పాలసీపత్రాన్ని తప్పనిసరిగా బీమా సంస్థకు సమర్పించాలి. కాబట్టి, దీన్ని ఆస్తి పత్రాల్లాగానే అత్యంత భద్రంగా దాచాల్సిన అవసరం ఉంది.

గోప్యం పనికిరాదు!

ఉద్యోగులు కావొచ్చు, వ్యాపారులు కావొచ్చు, పేద, రైతు కుటుంబాలు కావొచ్చు.. ఎవరైనా సరే బీమా పాలసీ తీసుకునేది కుటుంబ క్షేమం కోసమే. అందులో రహస్యమేమీ లేదు. కాబట్టి, మనం బీమా పాలసీ తీసుకున్న విషయాన్ని కచ్చితంగా మన కుటుంబ సభ్యులందరికీ చెప్పడం మంచిది. ఏ పాలసీ తీసుకున్నారు? ఎంత మొత్తానికి తీసుకున్నాము? బీమా సంస్థ/ఏజెంట్ వివరాలు, అవసరం వచ్చినప్పుడు ఎవరిని సంప్రదించాలి? పాలసీ పత్రం ఎక్కడ ఉంది? ఇలాంటివన్నీ జీవిత భాగస్వామికి తెలిసి ఉండాలి.

చెప్పుకోదగ్గ విషయం ఏమంటే.. ఇలా ఇంటిపెద్ద ప్రమాదవశాత్తు మరణించినప్పుడు.. ఆ పాలసీకి చెందిన వివరాలు తెలియక క్లెయిం చేసుకోని డబ్బులు.. పెద్ద మొత్తంలోనే అంటే కోట్ల రూపాయల్లోనే బీమా సంస్థల దగ్గర ఉందని ఐఆర్‌డీఏ 2014లో విడుదల చేసిన ఒక సర్క్యులర్‌లో పేర్కొంది.

పాలసీపత్రం అందుబాటులో ఉన్నప్పుడు క్లెయిం చేసుకోవడానికి ఏ ఇబ్బందీ ఉండదు. ఒకవేళ పాలసీ ఉన్నట్లు తెలియకపోయినా, పాలసీపత్రం కనిపించకపోయినా కొన్ని పద్ధతులను పాటించడం ద్వారా పాలసీ వివరాలను పొందే అవకాశం ఉంది.

నామినీదారులు.. ఇలా చేయాలి!

చనిపోయినవారు లేదా ప్రమాదానికి గురైన వారి జీవితబీమా పాలసీకి ఎవరో ఒకరు నామినీగా ఉంటారు. వారు పాలసీని క్లెయిం చేసుకోవాల్సి వచ్చినప్పుడు.. పాలసీపత్రాల గురించి ముందుగా ఇంట్లోనే వెతకాలి. ఆస్తి పత్రాలతోపాటు వీటినీ భద్రంగా దాచి ఉంటారు. కాబట్టి, అన్ని పత్రాలనూ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్నులు తదితర పత్రాల్లో ఈ పత్రమూ ఉండొచ్చు. అవసరమైతే బ్యాంకు లాకర్లనూ వెదకాలి.

పన్నుచెల్లింపు వివరాలు ఆధారంగా

గత కొన్నేళ్ల బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్నులు పరిశీలించడం ద్వారా పాలసీ గురించిన వివరాలు తెలుసు కునేందుకు అవకాశం ఉంది. బ్యాంకు ఖాతా నుంచి నేరుగా బీమా పాలసీకి ప్రీమియం చెల్లించే ఏర్పాటు చేసినప్పుడు ఖాతా వివరాలు పరిశీలిస్తే ఆ సంగతి తెలుస్తుంది. ఆదాయపు పన్ను రిటర్నులలో పాలసీకి ప్రీమియం చెల్లిస్తున్న సంగతి ఉండొచ్చు. పాలసీదారుడు పనిచేస్తున్న కార్యాలయంలో సంప్రదిస్తే.. దీనికి సంబంధించిన ఆధారాలేమైనా దొరకవచ్చు. కనీసం ప్రీమియం చెల్లించిన రశీదు దొరికినా.. పాలసీ క్లెయిం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

ఈ-ఇన్సూరెన్స్.. సౌకర్యం


ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బీమా పాలసీలు తీసుకునేవారి సంఖ్య పెరిగింది. కొంతమంది తమ పాత పాలసీలను ఈ-ఇన్సూరెన్స్ ఖాతాలోకి మార్చిస్తున్నారు. మొదట పాలసీపత్రాల రూపంలోనే వచ్చినా.. ఈ-ఇన్సూరెన్స్ చేయించినప్పుడు ఆ పత్రాలను రిపాజిటర్ తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి, పాలసీలను ఆన్‌లైన్‌లో తీసుకున్నారా? లేకపోతే ఈ-ఇన్సూరెన్స్ ఖాతాలోకి మార్పించారా? అనేది తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. దీనికి కూడా బ్యాంకు ఖాతా వివరాలు, అతని కార్యాలయంలో సమర్పించిన పత్రాలు సహాయం చేయవచ్చు. ఇన్సూరెన్స్ రిపాజిటరీ ఇటీవలే ప్రారంభం అయినప్పటికీ.. పాలసీదారుడు దీన్ని వినియోగించుకునే అవకాశాలను తోసిపుచ్చలేం. కాబట్టి, అందుబాటులో ఉన్న ఏ అంశాన్నీ మనం వదలకూడదు.

ఫోన్ డేటా.. ఆసరాగా



పాలసీదారుడి ఉద్యోగ సంస్థతోపాటు, అతని స్నేహితులు, పరిచయం ఉన్నవారిని ఆరా తీయడంతోనూ బీమా పాలసీ తీసుకున్నారా? లేదా? అనే వివరాలను తెలుసుకునేందుకు వీలుంది. పాలసీదారుడి ఫోనును పరిశీలించాలి. అందులో ఇన్సూరెన్స్‌కు సంబంధించిన వ్యక్తుల ఫోన్ నెంబర్లు ఉన్నాయా లేదా చూడాలి. పర్సనల్ డైరీలోనూ ఎక్కడైనా ఆయా ఇన్సూరెన్స్ వివరాలు రాసి, పెట్టి ఉండొచ్చు. ఇందులో కచ్చితంగా ఏదో ఒక చోట బీమా పాలసీ తీసుకున్న విషయం తెలుస్తుంది. ఒకసారి పాలసీ తీసుకున్న విషయం, దాని వివరాలు తెలిస్తే.. కనీసం క్లెయిం ప్రక్రియ ప్రారంభించేందుకు వీలవుతుంది.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమంటే, పొరపాటున బీమాపత్రాలను పోగొట్టుకుంటే, ఆ పోగొట్టుకున్న డాక్యుమెంట్స్ నకళ్ళను ఎంత తొందరగా సంపాదిస్తే అంత మంచిది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే.. ముఖ్యంగా జీవితబీమా తీసుకోగానే .. ఆ పత్రాలను చేతికి చేరగానే, వాటిని జిరాక్స్ కాపీలుగా తీసి.. కుటుంబ సభ్యుల దగ్గర ఉంచడమూ ఎంతో శ్రేయస్కరం. ఆపదకాలంలో అలా ఉంచిన పత్రాల ద్వారా బీమా అందుకునే అవకాశాలు ఉంటాయి.



కన్నడ చిత్రంలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ కన్నడ చిత్రంలో నటించబోతున్నారా! .. అంటే అవుననే ఫిలింనగర్ వర్గాల సమాచారం. వివరాల్లోకెళ్తే కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ 125వ చిత్రం 'బైరతి రణగల్'లో నటించబోతున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర కోసం దర్శక నిర్మాత నర్తన్ బాలయ్యను కలిశారట. బాలయ్య కూడా నటించడానికి ఓకే అన్నట్లు వార్తలు వినపడుతున్నాయి. బాలకృష్ణ 100వ చిత్రం 'గౌతమిపుత్ర శాతకర్ణి'లో శివరాజ్‌కుమార్ చిత్ర పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆయన చిత్రంలో బాలకష్ణ గెస్ట్ రోల్ చేయబోతున్నారన్నమాట. అయితే దీనిపై బాలకృష్ణ తరపు నుండి ఎలాంటి సమాచారం అధికారికంగా రాలేదు. మరి దీనిపై బాలయ్య ఎలా స్పందిస్తాడో చూడాలి.

జూన్‌లో మహేష్, సుక్కు సినిమా

ప్రస్తుతం 'మహర్షి' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్న మహేష్ తదుపరి చిత్రంగా సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయబోతున్నారు. ప్రస్తుతం సుకుమార్ ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ముందుగా పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమా చేయాలనుకున్నారు. కానీ తాజా సమాచారం ప్రకారం రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను తెరకెక్కించబో తున్నారు. ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసి సినిమాను జూన్‌లో సినిమాను స్టార్ట్ చేయబోతున్నారని టాక్. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై సినిమా నిర్మితం కానుంది. బాలీవుడ్ హీరోయిన్ కత్రినా కైఫ్‌ను నటింప చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తలు వినపడుతున్నాయి.





ఎల్.వి.ప్రసాద్ 111వ జయంతి ఉత్సవం



అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ 111వ జయంతి ఉత్సవం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో గురువారం ఉదయం జరిగింది. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''ఎల్.వి.ప్రసాద్ గారి గురించి చెప్పడం అంటే సూరీడికి వెలుగు చూపించడమే. ఆయన ఒక వ్యవస్థ. నటుడు కావాలనుకున్నారు. అలాగే నటించారు. దర్శకుడిగా మారారు. ఆయన సినిమా రంగంలో తనకు ఇష్టమైన అన్ని శాఖల్లోనూ కృషి చేశారు. ప్రసాద్ ల్యాబ్స్ అనే గొప్ప సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. సర్వేంద్రియానాం నయనం ప్రదానం అంటారు. అందుకే ఐ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తి. మద్రాసులో ఎదురెదురిళ్లల్లో ఉండేవాళ్లం. గతాన్ని ఎవరూ మర్చిపోకూడదు. భావి తరాలకు చెప్పాలి. ఎల్.వి.ప్రసాద్‌గారి కలల్ని ఆయన తనయుడు సాకారం చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. రమేష్ ప్రసాద్ మాట్లాడుతూ ''మా నాన్న సినిమా వ్యక్తి. ఆయనకు సినిమా తప్ప మరేమీ తెలియదు. ఇంట్లో వాళ్లని కూడా ఎక్కువగా కలిసేవారు కాదు.ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకి వెళ్లే దారిలో ఆయన రెస్ట్ తీసుకునేవారు. నేను ఇంజనీరింగ్ పూర్తి చేశాక ఈ రంగంలోకి వచ్చాను. అంతకు ముందే నన్ను నటుడిని చేయాలన్నది మా నాన్నగారి కోరిక. అయితే ఓ సారి సంసారం సినిమా షూటింగ్‌లో నేను అంతంత సేపు స్టూడియోలో కూర్చోవడం ఇష్టం లేక ఆయన్ని విసిగించాను. అప్పటి నుంచి నాకు యాక్టింగ్ మీద పెద్దగా ఆసక్తిలేదు. మా ప్రసాద్ ప్రాసెసింగ్ ల్యాబ్‌కి 17 సార్లు జాతీయ పురస్కారం దక్కింది. మా నాన్నకు పృథ్వీరాజ్‌కపూర్ ఫ్యామిలీ అంటే చాలా ఇష్టం. వాళ్లలాగా మా కుటుంబం కూడా సినిమాల్లోనే ఉండాలని కోరుకునేవారు. అప్పట్లో మా నాన్నగారి పాదాలను తాకేవారట జితేంద్రలాంటివారు. మా నాన్నకి సోషల్ రెస్పాన్స్ ఉండేది'' అని అన్నారు. ఈ కార్యక్రమంలో వై.వి.ఎస్.చౌదరి, గీతాంజలి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



శింబు స్థానంలో సిద్ధార్థ్



కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో రేపటి నుండి చిత్రీకరణ జరుపుకోబోతున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఇండియన్ 2'. లంచగొండుల భరతం పట్టిన సేనాపతిగా కమల్ హాసన్ మరోసారి వెండితెరపై సందడి చేయబోతున్నారు. ఈ సినిమాలో కమల్ హాసన్ మనవడి పాత్రలో సిద్ధార్థ్ నటించబోతున్నారట. ముందుగా ఈ పాత్రను శింబు చేస్తున్నాడని వార్తలు వినిపించాయి. అయితే లెటెస్ట్ న్యూస్ ప్రకారం ఆ పాత్రలో సిద్ధార్థ్ నటించబోతున్నాడట. శంకర్ దర్శకత్వంలో 'బాయ్స్' చిత్రం ద్వారా హీరోగా పరిచయమైన సిద్ధార్థ్.. మరోసారి శంకర్‌తో కలిసి పనిచేస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుంది.

చివరి షెడ్యూల్‌లో 'నిను వీడని నీడను నేనే'



● సందీప్ కిషన్

సందీప్ కిషన్, అనన్య సింగ్ హీరో హీరోయిన్‌గా నటిస్తోన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'నిను వీడని నీడను నేనే'. వెంకటాద్రి టాకీస్, విస్తా డ్రీమ్ మర్చంట్ పతాకాపై నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని ఎ.కె.ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనీల్ సుంకర విడుదల చేస్తున్నారు. కార్తీక్ రాజు దర్శకుడు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ ''సూపర్ నేచురల్ కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని డిఫరెంట్ పాయింట్‌తో, హై టెక్నికల్ వేల్యూస్‌తో సినిమాను రూపొందిస్తున్నాం. వైవిధ్యమైన సినిమాలు చేసిన హీరో సందీప్ కిషన్ నటిస్తోన్న తొలి సూపర్ నేచురల్ థ్రిలర్ ఇది. సందీప్ కిషన్‌ను మరో కొత్త పాత్రలో చూస్తారు. ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్‌ను హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. హీరో హీరోయిన్‌ల పై కొన్ని కీలక సన్నివేశాలు ఒక ముఖ్యమైన పోరాట సన్నివేశం చిత్రీకరించనున్నారు దీంతో సినిమా పూర్తవుతుంది'' అన్నారు. నిర్మాత దయా పన్నెం మాట్లాడుతూ ''దర్శకుడు కార్తీక్ సినిమాను అనుకున్న ప్లానింగ్ ప్రకారం పూర్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

రకుల్ ప్రీత్ ఆగ్రహం

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ వేసుకునే దుస్తులపై భగత్ అనే నెటిజన్ కామెంట్ చేశాడు. అతని అసభ్యమైన కామెంట్స్‌పై రకుల్ ఆగ్రహంతో ఘాటుగా స్పందించారు. 'మీ అమ్మ నీకు ఇలాంటివే నేర్పిస్తున్నారా? మంచి విషయాలు నేర్పించమని అడుగు. నీలాంటి వాళ్లు ఉంటే ఆడవాళ్లకే రక్షణ ఉండదు. సమానత్వం, రక్షణ గురించి డిబేట్లు పెడితే సరిపోదు' అని తన ట్విట్టర్‌లో మెసేజ్ పోస్ట్ చేశారు. దీనిపై కొందరు నెటిజన్లు 'భగత్ చేసిన కామెంట్స్‌కు అతని తల్లిని అనడం ఎంత వరకు సబబు' అంటూ కామెంట్స్ చేశారు. 'నీచమైన ఆలోచనలు ఉన్నవారికి నా భాషలో బుద్ధి చెప్పాలనుకున్నాను. వారికి కూడా కుటుంబం ఉంటుంది. వారిని ఏమైనా అంటే నాలాగే ఫీల్ అవుతారని అలా స్పందించాను. భగత్ కామెంట్స్‌కు అతని తల్లి చెంప చెళ్లుమనిపిస్తుందని ఆశిస్తున్నాను'' అన్నారు రకుల్.



● మేఘా ఆకాశ్

నాని జతగా నితిన్ హీరోయిన్

'13బి, ఇష్క్, మనం, 24, హలో చిత్రాలకుదర్శకుడు విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో నాని హీరోగా రూపొందుతోన్న 24వ చిత్రానికి రంగం సిద్ధమవుతోంది. 'శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్', 'రంగస్థలం'... వరుసగా సెన్సేషనల్ హిట్స్ తో హ్యాట్రిక్ అందుకున్న భారీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. ఫిబ్రవరి 19 నుండి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సినీ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రంలో మేఘా ఆకాశ్ పేరుని హీరోయిన్‌గా పరిశీలిస్తున్నారట. అంతా ఓకే అయితే.. 'లై, ఛల్ మోహన్‌రంగ' సినిమాల తర్వాత మేఘా ఆకాశ్ నటించే తెలుగు చిత్రమిదే అవుతుంది.

రన్నర్ టు బాక్సర్

ఫ్లయింగ్ సిక్ జీవితం ఆధారంగా 'బాగ్ మిల్కా భాగ్' బయోపిక్‌ను తెరకెక్కించిన రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రా మరోసారి ఫర్హాన్ అక్తర్‌తో మరోసారి జత కట్టనున్నారు. ఆరేళ్ల తర్వాత అంటే.. 2013లో భాగ్ మిల్కా భాగ్ విడుదలై ఘన విజయం సాధించింది. ఇన్నేళ్ల తర్వాత వీరిద్దరూ ఓ బాక్సర్ జర్నీ ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్ ఆధారంగా సినిమా చేయబోతున్నారట. అయితే ఇది ఎవరిదైనా బాక్సర్ జీవిత కథా? లేదా అనేది తెలియడం లేదు. ఈ చిత్రానికి 'తుఫాన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయట. త్వరలోనే సినిమాకు సంబంధించిన అధికారిక సమాచారం రానుంది.



● ఓం ప్రకాష్ మెహ్రా



● ఫర్హాన్ అక్తర్

సైరాలో విజయ్ సేతుపతి లుక్

మెగాస్టార్ ప్రెస్టీజియస్ మూవీ 'సైరా నరసింహా రెడ్డి' శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటుంది. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాన్ని ఆధారంగా చేసుకుని తెరకెక్కిస్తున్నారు. కాగా ఈ సినిమాలో ఉయ్యాలవాడకు సహకారం అందించిన రాజా పాండి అనే పాత్రలో తమిళ హీరో విజయ్ సేతుపతి నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్ర యూనిట్ ఆయన లుక్‌ను విడుదల చేసింది. సైరా సినిమాను తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో విడుదల చేయడానికి రాంచరణ్ ప్లాన్ చేస్తున్నారు. అమితాబ్ బచ్చన్, నయనతార, కిచ్చా సుదీప్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్ల నటిస్తున్నారు. ఈ ఏడాది దసరాకు సినిమాను విడుదల చేసేలా సన్నాహాలు జరుగుతున్నాయి.



డ్రైవరు లేని సోలార్ బస్సు!

● విద్యార్థుల అద్భుత సృష్టి



ఫగ్వారా, జనవరి 17: ఇంధనమే అవసరం లేకుండా, సౌరశక్తితో నడిచే బస్సు.. పైపెచ్చు డ్రైవరుతో పనిలేకుండా నడిచే బస్సుకు మన విద్యార్థులు రూపకల్పన చేశారు. ప్రపంచంలో ఇప్పటి వరకు రూపొందించిన డ్రైవరు లేని బస్సులు అన్నీ పెట్రోలు, డీజల్ లేదా సీఎన్‌జీ ఇంధనంతో నడుస్తుండగా ఈ సరికొత్త బస్సు మాత్రం సౌరశక్తితో పనిచేస్తుండడం విశేషం. ఒక్కసారి సౌరశక్తితో రీచార్జ్ చేస్తే 70 కిలోమీటర్ల మేర ఈ బస్సు నిరాటంకంగా పరుగులు తీస్తుంది. కేవలం 15 లక్షల రూపాయలతో ఈ బస్సును తయారు చేయవచ్చు. వాహనంపై ఉన్న సోలార్ ప్యానెల్స్‌తో రెండు కిలోవాట్ల పవర్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండేలా బస్సును రూపొందించడం విశేషం. ''ఆటోమేటిక్‌గా నడిచే ఈ బస్సు ఎన్ని కిలోమీటర్లైనా సునాయాసంగా ప్రయాణించగలదు, రోడ్డు, పరిసర ప్రాంతాలను సెన్సార్ల ద్వారా ఇది పసిగట్టి పయనిస్తుంది, సోలార్ ప్యానెల్స్ వాహనంపైనే ఉండడంతో నిరంతరం అవి రీచార్జ్ అవుతూనే ఉంటాయి, ఏడాది సమయంలో దీన్ని ఇక్కడి విద్యార్థులు, అధ్యాపకులు కలిసి తయారు చేశారు'' అంటూ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి చెందిన ప్రాజెక్ట్ లీడర్ మన్దీప్ సింగ్ వెల్లడించారు. ప్రస్తుతానికి కాలేజీ క్యాంపస్‌లో మాత్రమే ఈ బస్సును ఉపయోగిస్తున్నారు.

సైన్యంలోకి తేలికపాటి యుద్ధ హెలికాప్టర్లు

● రూపొందించిన హెచ్ఏఎల్



బెంగళూరు, జనవరి 17: యుద్ధంలో ఉపయోగించే తేలికపాటి హెలికాప్టర్లు (ఎల్‌సీహెచ్) ఆయుధ పరీక్షను పూర్తిచేసుకున్నట్టు ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వెల్లడించింది. ప్రస్తుతం ప్రయోగ దశను దాటిన ఈ ఎల్‌సీహెచ్‌లను ఆపరేషన్‌లకు ఉపయోగించవచ్చని కూడా హెచ్ఏఎల్ స్పష్టంచేసింది. ఆకాశంలో కదులుతున్న లక్ష్యాలను ఛేదించేందుకు గగనతలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణిని ఛేదించడంతో ఎల్‌సీహెచ్ సరికొత్త మైలురాయిని చేరుకుందని హెచ్ఏఎల్ వివరించింది. ఇటీవలే ఒడిసాలోని చాందీపూర్‌లో ఈమేరకు ఆయుధ పరీక్షలు విజయవంతంగా పరీక్షించినట్టు, లక్ష్యాన్ని చాలా స్పష్టంగా ఎల్‌సీహెచ్ ఛేదించగలిగిందని హెచ్ఏఎల్ టెస్ట్ పైలట్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ క్యాప్టెన్ రాజీవ్ దూబే వెల్లడించారు. ఇలాంటి ప్రయత్నం మొట్టమొదటిసారి జరిగిందని కూడా రక్షణశాఖ వెల్లడించింది. దీంతో పాటు ఎల్‌సీహెచ్‌లో ఇతర ఆయుధాలుగా 20ఎంఎం టర్రెట్ గన్, 70ఎంఎం రాకెట్లు ఉండగా వీటి ప్రయోగం కూడా గతేడాది విజయవంతంగా పూర్తయింది. సియాచిన్ గ్లేసియర్ వంటి అత్యంత ఎత్తైన ప్రాంతంలో కూడా పనికొచ్చే ఏకైక యుద్ధ హెలికాప్టర్ ఎల్‌సీహెచ్ కావడం విశేషం. 'ఫార్వర్డ్ లుకింగ్ ఇన్ఫ్రారెడ్ సైటింగ్ సిస్టం' ద్వారా భూమి ఉపరితలంపైన, గగనతల ంలోని ఏ ల క్ష్యాన్నైనా పైలట్ ఛేదించే సామర్థ్యముండేలా ఎల్‌సీహెచ్‌ను రూపొందించారు.

అగస్త్యర్‌ను అధిరోహించిన మహిళ

● చరిత్రలో తొలిసారి అధిరోహించిన ధన్యా



తిరువనంతపు, జనవరి 17: కేరళలోని అగస్త్యర్ కూడమ్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా ధన్యా సనాల్ రికార్డు సృష్టించారు. రాష్ట్రంలో అత్యంత ఎత్తైన రెండో పర్వత శిఖరంగా పేరొందిన అగస్త్యర్ కూడమ్‌ను ఎక్కేందుకు చాలా కాలంగా మహిళలకు అనుమతి లేదు. శిఖరంపైకి మహిళలను రావొద్దని ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ గతేడాది డిసెంబరు 9న కేరళ హైకోర్టు తీర్పు వెలువరించింది. దీంతో ధన్యా పర్వతారోహణ చేసేందుకు సిద్ధమైంది. దాదాపు 100 మంది మహిళలు అగస్త్యర్ కూడమ్‌ను అధిరోహించేందుకు దరఖాస్తు చేసుకోగా.. మొదటి అవకాశం ధన్యాకే దక్కింది. సోమవారం ఉదయం అధిరోహణ ప్రారంభించిన ఆమె ఎంతగానో శ్రమించి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పైకి చేరుకున్నారు. ఆమెతో పాటు మరో పది మంది పురుషులు పర్వతారోహణ చేశారు. ధన్యా తిరువనంతపురంలో రక్షణశాఖ ప్రతినిధిగా పని చేస్తున్నారు. అగస్త్యర్ కూడమ్‌ను అధిరోహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించిన ధన్యా తనకు సహాయం చేసిన వారికి క తజ్ఞతలు తెలిపారు. శిఖరం అంచుకు చేరుకోగానే ఆమె తన వెంట తెచ్చుకున్న 'థ్యాంకూ ఆల్' బ్యానర్‌ను పట్టుకొని ఫొటోలు దిగింది. అనంతరం ఆమె అక్కడి నేలకు ముద్దుపెట్టింది. 'మొదటి ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్‌కు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. సునాయాసంగా వెళ్లిపోయాం. కానీ ఆ తర్వాత 4 కిలోమీటర్లు అత్యంత కష్టపడాల్సి వచ్చింది. అలసట తీర్చుకునేందుకు అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. నాకు తోడుగా ఇద్దరు మహిళా సిబ్బందిని వెంట పంపించారు. అటవీశాఖ అధికారుల సూచనలను అనుసరిస్తూ పర్వతారోహణ చేశారు. నిషేధం విధించిన ప్రదేశం వైపు వెళ్లలేదు. కని గిరిజనుల మనోభావాలు దెబ్బతినకుండా చూసుకున్నాం. వాళ్లు నివసిస్తున్న ప్రదేశాలవైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుని చివరి వరకు ప్రయాణాన్ని కొనసాగించాం' అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్వతశిఖరాన్ని మహిళలు ఎట్టిపరిస్థితుల్లోను ఎక్కరాదంటూ ఎన్నో తరాల నుంచి గిరిజన సంప్రదాయం నిషేధిస్తోంది. నెయ్యార్ వన్యప్రాణి సంరక్షణ ప్రాంతంలో అగస్త్యర్‌కూడమ్ ఉంది. యునెస్కో దీన్ని వారసత్వ ప్రాంతంగా ప్రకటించింది. ఈ శిఖరాన్ని మహిళలు ఎక్కడానికి స్థానిక కని గిరిజన తెగవారు ఎట్టిపరిస్థితుల్లోను అంగీకరించడం లేదు. అగస్త్య మహాముని ఇక్కడి ప్రాణికోటిని సదా సంరక్షిస్తూ ఉంటారన్నది వారి నమ్మకం. పర్వతశిఖరాగ్రాన అగస్త్య మహాముని ఆలయం ఉంది. తనకు శిఖరారోహణం ఇష్టమని, గుడిని చూడాలన్న ఉద్దేశమేమీ లేదని, స్థానికుల మనోభావాలను దెబ్బతీయాలన్న ఉద్దేశం లేదని ఆమె ప్రకటించారు.


బీజేపీ విరాళాలు 437 కోట్లు


● అత్యధికంగా ఆ పార్టీకే: ఏడీఆర్

న్యూఢిల్లీ, జనవరి 17: ఈఆర్థిక సంవత్సరానికి గాను బీజేపీనే అధిక మొత్తంలో విరాళాలు అందుకుంది. 2017 – 18 కి గాను జాతీయ పార్టీలన్నీ కలిపి మొత్తం రూ.469.89 కోట్లు విరాళాలుగా అందుకున్నాయి. అందులో ఒక్క బీజేపీకే 93 శాతం అనగా రూ.437.04 కోట్లు వచ్చినట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫామ్స్(ఏడీఆర్) వెల్లడించింది. ప్రతి ఏడాది జాతీయ పార్టీలన్ని తమకు వచ్చిన విరాళాల గురించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తాయి. ఈ సమాచారం ప్రకారం ఏడీఆర్ ఈ నివేదికను విడుదల చేసింది.రూ.20 వేలకు పైగా విరాళాలు అందుకున్న జాతీయ పార్టీల వివరాలను ఈ నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం కాంగ్రెస్ పార్టీకి రూ.26.658 కోట్లు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రూ.2.087 కోట్లు, సీపీఐ(ఎం) రూ.2.756 కోట్లు, సీపీఐ రూ.1.14 6కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రూ.20 లక్షలు విరాళాలుగా అందుకున్నాయి. బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)కి కనీసం రూ.20వేలు కూడా రాలేదని తెలిసింది. కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, త1ణమూల్ కాంగ్రెస్ పార్టీ అందుకున్న విరాళాల కంటే బీజేపీకి వచ్చిన విరాళాలు 12 రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. మొత్తం 4,201 మంది జాతీయ పార్టీలకు విరాళాలు ఇవ్వగా.. అందులో 2,977 మంది బీజేపీకి, 777 మంది కాంగ్రెస్‌కు, 42 మంది ఎన్సీపీకి, 196 మంది సీపీఎమ్‌కు, 176 మంది సీపీఐకి, 33 మంది త ణమూల్‌కు విరాళాలు ఇచ్చినట్లు సదరు నివేదిక తెలిపింది. 2016–17తో పోల్చుకుంటే ఈ ఏడాది జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాలు 20 శాతం తగ్గినట్లు ఏడీఆర్ పేర్కొంది. ఆ ఏడాది అన్ని పార్టీలకు కలిపి రూ.589.38 కోట్లు విరాళాలు రాగా.. 2017 – 18 ఏడాదికి గాను రూ.469.89 కోట్ల విరాళాలు వచ్చాయని తెలిపింది.

జైట్లీ త్వరగా కోలుకోవాలి

● మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం: రాహుల్





న్యూఢిల్లీ, జనవరి 17: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. చికిత్స నిమిత్తం జైట్లీ విదేశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు రాహుల్ గాంధీ.. అరుణ్ జైట్లీ త్వరగా కోలుకోవాలంటూ ట్వీట్ చేశారు. అరుణ్ జైట్లీ అకస్మాత్తుగా అమెరికా వెళ్లారు. గత సంవత్సరం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో జైట్లీకి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ అనంతరం విదేశాల్లో ఆయన చికిత్స పొందడం ఇదే ప్రథమం. ''జైట్లీ జీ మేము ప్రతిరోజు మీ విధానాలతో విభేదిస్తుంటాము. కానీ మీ అనారోగ్యం వార్త మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. మీరు త్వరగా కోలుకోవాలని నేను, మా పార్టీ నాయకులందరం మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఇలాంటి సమయంలో మీకు, మీ కుటుంబ సభ్యులకు 100 శాతం తోడుగా నిలుస్తామం'టూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. అరుణ్ జైట్లీ త్వరలోనే తిరిగి వస్తారని.. అందువల్ల ఈ శాఖ బాధ్యతలను ఎవరికి అప్పగించడం లేదని తెలిసింది. మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి జైట్లీ ఇక్కడ ఉంటారని తెలిసింది.

కాంగ్రెస్‌పై మండిపాటు

జైట్లీ ఆరోగ్యం గురించి వినగానే తాను చాలా దిగ్భ్రాంతికి గురయ్యానని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేయడంతో మండిపడ్డారు. రాహుల్ పేరు ప్రస్తావించకుండా.. అబద్ధాలను తయారుచేయడంలో వాళ్లకు ఏమాత్రం సంకోచం లేదని, అబద్ధాల పెట్టుబడిదారులుగా వాళ్లు తయారయ్యారని తన బ్లాగ్‌లో కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. 2019 ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే చిట్టచివరి బడ్జెట్‌ను ఈసారి అరుణ్ జైట్లీ చదవగలరా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినా.. తన బ్లాగ్ రాయడం మాత్రం ఆయన ఆపలేదు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వెళ్లినా తమ వాదనలను మాత్రం అడ్డగోలుగా చేస్తారన్నారు. అవినీతికి యుద్ధం అనే ముసుగు వేసుకుని వస్తారని, ఎప్పుడూ ద్వంద్వ ప్రమాణాలు పెట్టుకునే ఉంటారని అన్నారు. జస్టిస్ లోయా కేసు, రఫేల్ కేసు, సీబీఐ వ్యవహారం, జడ్జీలు, రిజర్వుబ్యాంకు.. ఇలా ప్రతి అంశంలోనూ కాంగ్రెస్ పార్టీ ఇలాగే చేసిందంటూ పలు ఉదాహరణలు కూడా తెలిపారు. ప్రజల్లో వాళ్లు ప్రచారం చేసిన ప్రతి అబద్ధం వాళ్లు తయారుచేసిందేనని అన్నారు. జడ్జి బీహెచ్ లోయా గుండెపోటు వల్ల సహజంగానే చనిపోయారని, అందులో వేరే వ్యక్తుల పాత్ర గానీ, అక్కడకు సమీపంలో వేరెవ్వరూ గానీ లేరని.. అయినా వాళ్లకు అనుకూలంగా ఉండే వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ప్రచారాలు, అబద్ధపు ప్రజాహిత వ్యాజ్యాలు.. ఇవన్నీ వచ్చేశాయని, చివరకు గుండెపోటుతో మరణిస్తే దాన్ని కుట్రపన్ని హత్యగా మార్చేందుకు ప్రయత్నించారని అన్నారు.

పియూష్ గోయల్ బడ్జెట్?

జైట్లీ అనారోగ్యం దృష్ట్యా ఆయన ఈసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కనిపించడం లేదు. దాంతో ఇంతకుముందు జైట్లీ విశ్రాంతి తీసుకున్నప్పుడు ఆర్థిక శాఖ బాధ్యతలను తాత్కాలికంగా నిర్వహించిన కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఈసారి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం కనిపిస్తోంది.

కోలుకుంటున్న అమిత్‌షా

● ఒకటి రెండు రోజుల్లో డిశ్చార్జి

న్యూఢిల్లీ, జనవరి 17: స్వైన్ ఫ్లూతో ఆసుపత్రిలో చేరిన బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా ప్రస్తుతం కోలుకుంటున్నారని ఆ పార్టీ గురువారం వెల్లడించింది. ఒకట్రెండు రోజుల్లో ఆయన డిశ్చార్జ్ అవుతారని వెల్లడించింది.'బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా కోలుకుంటున్నారు. రేపు లేదా ఎల్లుండి ఆయన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతారు. మీ అభిమానానికి ధన్యవాదాలు' అని బీజేపీ మీడియా హెడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ బలూనీ తెలిపారు. స్వైన్ ఫ్లూతో బాధపడుతూ అమిత్ షా బుధవారం ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయాన్ని ట్విటర్ వేదికగా తెలిపారు. దేవుడి దయ, అందరి అభిమానంతో తాను త్వరగా కోలుకుంటానని పేర్కొన్నారు. ఎయిమ్స్ డైరెక్టర్ రణదీప్ గులేరియా పర్యవేక్షణలో వైద్యులు అమిత్ షాకు చికిత్స అందిస్తున్నారు. కాగా.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ లాల్ అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న రామ్ లాల్‌ను కుటుంబసభ్యులు నోయిడాలోని కైలాశ్ ఆసుపత్రిలో చేర్పించారు.

భారతీయులకు కీలక పదవి

● నలుగురికి పదవులు కట్టబెట్టిన ట్రంప్

● ఇంటెలిజెన్స్ కాంగ్రెషనల్ సభ్యుడిగా రాజా కృష్ణమూర్తి

● జాతీయ భద్రత విభాగంలో తొలి దక్షిణాసియా వ్యక్తి



వాషింగ్టన్, జనవరి 17: అమెరికాలో డెమోక్రటిక్ పార్టీకి చెందిన ప్రముఖ ఇండో–అమెరికన్ శాసనసభ్యుడు రాజా కృష్ణమూర్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగంలో కీలక పదవి దక్కనుంది. ఇంటెలిజెన్స్‌పై ఏర్పాటు చేసిన కాంగ్రెషనల్ కమిటీలో సభ్యుడిగా కృష్ణమూర్తికి అవకాశం వచ్చింది. అమెరికా జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ కమిటీలో చోటు దక్కించుకుని.. ఈ విభాగంలో పనిచేయబోతున్న తొలి దక్షిణాసియా వ్యక్తిగా రాజా కృష్ణమూర్తి(45) ఘనత సాధించారు. డొనాల్డ్ ట్రంప్ మరో ముగ్గురు భారతసంతతి వ్యక్తులను కీలక పదవుల్లో నియమించారు. రీటా బరన్‌వాల్‌ను ఇంధనశాఖ అణుశక్తి విభాగం అసిస్టెంట్ సెక్రెటరీగా, ఆదిత్య బంజాయ్‌ని పౌరహక్కుల బోర్డు సభ్యునిగా, బిమల్ పటేల్‌ను ఆర్థికశాఖ అసిస్టెంట్ సెక్రెటరీగా నామినేట్ చేశారు. ఈ నామినేషన్లను కాంగ్రెస్ ఆమోదం కోసం పంపించారు. వీరి నియామకాల గురించి ట్రంప్ ఇదివరకే ప్రకటించినప్పటికీ బుధవారం కాంగ్రెస్‌కు అధికారికంగా ప్రతిపాదనలు సమర్పించారు. ఇప్పటివరకు మూడు డజన్లకు పైగా భారతసంతతి వ్యక్తులను ట్రంప్ ప్రభుత్వ పదవుల్లో నియమించారు. నిక్కీ హేలీ క్యాబినెట్ ర్యాంకుతో ఐక్యరాజ్య సమితి రాయబారిగా పనిచేసి ఇటీవలే రాజీనామా చేశారు. ఉప పత్రికా కార్యదర్శిగా పనిచేసిన రాజ్‌షా కూడా తన పదవి నుంచి తప్పుకున్నారు. కృష్ణమూర్తి ఇల్లినాయిస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్‌పై హౌస్ పర్మినెంట్ సెలెక్ట్ కమిటీలో ఈయనతో పాటు ఫ్లోరిడాకు చెందిన వాల్ డెమింగ్స్ అనే శాసన సభ్యురాలిని, న్యూయార్క్‌కు చెందిన సేన్ పాట్రిక్ మలోనీ, వెర్మాంట్‌కు చెందిన పీటర్ వెల్చ్ అనే నలుగురు డెమోక్రటిక్ నేతలను నియమించారు. ఈ కమిటీ అమెరికాలోని 17 ఇంటెలిజెన్స్ ఏజెన్సీల పనితీరును, బడ్జెట్‌ను పర్యవేక్షిస్తుంది. అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ అయిన డెమోక్రటిక్ నేత నాన్సీ పెలోసీ బుధవారం క ష్ణమూర్తిని ఈ కమిటీలో నియమించారు. ఈ సందర్భంగా పెలోసీ మాట్లాడుతూ.. డెమోక్రాట్లు జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తారని అన్నారు. ఇంటెలిజెన్స్ కమిటీలోకి తనను తీసుకోవడంపై కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. కమిటీలో తోటి వారితో కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నానన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి ఇవ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. ఉగ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు అమెరికా దేశ భద్రతకు ఎన్నో సవాళ్లు ఉన్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు తన వంతు క షి చేస్తానని వెల్లడించారు. రాజా తల్లిదండ్రులు భారత్‌లోని తమిళనాడుకు చెందిన వారు. ఆయనకు మూడు నెలల వయసు ఉన్నప్పుడే వాళ్లు న్యూయార్క్‌కు వెళ్లిపోయారు. ఆయన ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. హార్వర్డ్ లా స్కూల్‌లో కూడా చదువుకున్నారు.

హెచ్1బీ ఉద్యోగులకు వేధింపులు

● వేతన దోపిడీకి గురవుతున్నారు


● అట్లాంటిక్ కౌన్సిల్ పరిశీలనలో వెల్లడి

వాషింగ్టన్, జనవరి 17: అమెరికాలో హెచ్–1బీ వీసాలపై పనిచేస్తున్న ఉద్యోగులకు చాలా సార్లు పని వాతావరణం ఏమాత్రం బాగుండట్లేదని, వేధింపులకు గురవుతున్నారని, పనికి తగిన వేతనం ఇవ్వకుండా దోపిడీ చేస్తున్నారని అమెరికాకు చెందిన ఓ సంస్థ వెల్లడించింది. ఈ ఉద్యోగాల విషయంలో.. జీతాల పెంపుతో పాటు పలు సంస్కరణలు తీసుకురావాలని సౌత్ ఏషియన్ సెంటర్ ఆఫ్ ది అట్లాంటిక్ కౌన్సిల్ (థింక్–ట్యాంక్) అనే సంస్థ సూచించింది. ఈ వీసాలపై పనిచేసే వారికి మంచి పని వాతావరణం, ఉద్యోగ హక్కులు కల్పించాలని పేర్కొంది. హెచ్–1బీ వీసా విధానంలో మార్పులు తీసుకొస్తామని, మంచి సంస్కరణలు చేస్తామని, ప్రతిభావంతులు అమెరికాలో ఉండేందుకు మార్గం సుగమం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో ఈ సంస్థ ఉద్యోగ పరిస్థితులను చాలా మెరుగు పరచాలంటూ నివేదిక విడుదల చేసింది.ప్రస్తుతం ఉన్న హెచ్–1బీ వీసా విధానం వల్ల అమెరికన్లకు హానీ జరగడంతో పాటు.. హెచ్–1బీ వీసాదారులు దోపిడీకి, వేధింపులకు గురవుతున్నారని, తగిన వేతనం ఇవ్వకుండా పని చేయించుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. వారికి తగిన వేతనంతో పాటు చక్కని పని వాతావరణం, ఉద్యోగ హక్కులు కల్పిస్తే ఇక్కడ వారి జీవితాలు మెరుగవుతాయని పేర్కొంది. ఈ వీసాల విషయంలో మొదట చేయాల్సిన పని జీతాలు పెంచడం అని తెలిపింది. అప్పుడే అత్యుత్తమ ప్రతిభావంతులు అమెరికాకు వస్తారని వెల్లడించింది. కంపెనీలు అమెరికన్లను కూడా తగినన్ని ఉద్యోగాలు ఇవ్వాలని తెలిపింది.

వాట్సాప్ ద్వారా విడాకులు

● భర్త నాగ్‌పూర్‌లో.. భార్య అమెరికాలో


● విడాకులు మంజూరు చేసిన ఫ్యామిలీ కోర్టు



నాగపూర్, జనవరి 17: ఇదో వింత విడాకుల కేసు. భర్త ఒక చోట.. భార్య మరో చోట ఉన్నా.. నాగపూర్‌లోని ఓ ఫ్యామిలీ కోర్టు మాత్రం వాట్సాప్ ద్వారా విడాకులు మంజూరు చేయడం విశేషం. భార్య అమెరికాలో మిషిగాన్‌లో స్టూడెంట్ వీసాపై ఉంది. అయితే విడాకుల కేసుకు నేరుగా హాజరయ్యే వీలు తనకు లేదని, వాట్సాప్‌లో వీడియో కాల్ ద్వారా విచారణకు హాజరవుతానని ఆమె చెప్పింది. భర్త కూడా మిషిగాన్‌లోనే పని చేస్తున్నా.. ప్రస్తుతం వేరే పని మీద నాగపూర్ రావడంతో అతను కోర్టుకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా వాట్సాప్ వీడియో కాల్‌లో విడాకులకు భార్య అనుమతి తీసుకున్న కోర్టు.. పెళ్లి బంధాన్ని తెంచేసింది. భార్యకు ఒకేసారి రూ.10 లక్షలు చెల్లించాలన్న నిబంధనతో నాగపూర్ ఫ్యామిలీ కోర్టు జడ్జి స్వాతి చౌహాన్ విడాకులు మంజూరు చేశారు. 2013, ఆగస్ట్ 11న సికింద్రాబాద్‌లో ఈ ఇద్దరి పెళ్లి జరగడం విశేషం. ఇద్దరూ కొంత కాలం మిషిగాన్‌లో కలిసి ఉన్నా.. భార్య నాగపూర్‌కు వచ్చి అత్తగారింట్లో కొన్నాళ్లు ఉండటంతో గొడవలు మొదలయ్యాయి. ఆమె అమెరికా వీసా గడువు కూడా ముగిసిపోవడంతో స్టూడెంట్ వీసాపై తిరిగి మిషిగాన్ వెళ్లింది. 2013లో నాగ్‌పూర్‌కు చెందిన వ్యక్తి, సికింద్రాబాద్ వాసి అయిన ఓ అమ్మాయి పెద్దలు కుదిర్చిన వివాహంతో ఒక్కటయ్యారు. ఇంజనీరింగ్ పట్టభద్రులైన వారు అమెరికాకు చెందిన ఆటోమొబైల్ కంపెనీలో పనిచేసేవారు. అయితే యూఎస్ వీసా గడువు ముగియడంతో కొంతకాలం ఆమె నాగ్‌పూర్‌లోని బంధువుల ఇంట్లో ఉన్నప్పటి నుంచి వారి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. తర్వాత ఆమె విద్యార్థి వీసా మీద మిచిగాన్ వెళ్లినా.. వారి మధ్య సఖ్యత కుదరకపోగా, మరింత దూరం పెరిగింది. దాంతో భర్త నాగ్‌పూర్ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేశాడు. నిబంధనల ప్రకారం ఆ కేసును కౌన్సిలర్‌కు అప్పగించారు. కౌన్సిలర్ ఆమెను వాట్సాప్ వీడియో కాల్ ద్వారా ప్రశ్నించి, ఆ కాల్‌ను రికార్డు చేశారు. భార్య తరపున ఆమె సోదరుడు హాజరయ్యాడు. తర్వాత భర్తను ప్రశ్నించగా ఇద్దరూ విడాకులకు సుముఖంగా ఉన్నట్లు వెల్లడైంది.

33 రోజుల తర్వాత..

● మేఘాలయ బొగ్గుగని ప్రమాదంలో మృతదేహం గుర్తింపు



న్యూఢిల్లీ, జనవరి 17: మేఘాలయ బొగ్గుగనిలో చిక్కుకుపోయిన కార్మికుల్లో ఎట్టకేలకు.. 33 రోజుల తర్వాత ఒకరి మృతదేహం లభ్యమైంది. వీరి ఆచూకీ కోసం గత నెల రోజులుగా సహాయకచర్యలు చేపట్టిన నేవీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గురువారం ఉదయం ఓ కార్మికుడి మ తదేహాన్ని గుర్తించారు. దాదాపు 160 అడుగుల లోతులో నేవీ సిబ్బంది ఈ మృతదేహాన్ని గుర్తించి గని పైకి తీసుకొచ్చారు. అయితే పోస్టుమార్టం తర్వాతే పూర్తి వివరాలపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. మేఘాలయలోని తూర్పు జయంతియా జిల్లాలో డిసెంబరు 13న 15 మంది కార్మికులు బొగ్గు గనిలోకి వెళ్లి చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. దట్టమైన చెట్లతో కూడి ఉన్న కొండపై ఉండే ఎలుక బొరియల్లో అక్రమంగా బొగ్గు తవ్వేందుకు కూలీలు లోపలికి వెళ్లగా.. పక్కనే ప్రవహిస్తున్న లిటిల్ నది నీరు గనిలోకి ముంచెత్తడంతో 15 మంది కార్మికులు అందులోనే చిక్కుకుపోయారు. వీరిలో కొందరు ప్రాణాలతో బయటపడ్డారు. చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, వైమానిక దళం, అగ్నిమాపక దళం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అయితే గనిలో నీరు ఎక్కువగా ఉండటంతో సహాయకచర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. గనిలో దాదాపు 370 అడుగుల లోతు నుంచి నీటికి బయటకు పంపడం కష్టంగా మారింది. దీంతో కార్మికుల ఆచూకీ కనిపెట్టడం ఆలస్యమవుతోంది. గనిలో చిక్కుకుని నెల గడిచిపోవడంతో వారు బతికే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సిరీస్ నీదా? నాదా?

నేడు ఇండియా, ఆస్ట్రేలియా మధ్య చివరి, మూడో వన్డే

ఉదయం 7:50 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



మెల్‌బోర్న్: ఉత్సాహం, స్వీయ నమ్మకం సమపాళ్లలో కొనసాగిస్తున్న టీమిండియా తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై ద్వైపాక్షిక సిరీస్ టైటిల్‌పై కన్నేసింది. టెస్టు సిరీస్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన టీమిండియా శుక్రవారమిక్కడ ఆస్ట్రేలియాతో చివరి, మూడో వన్డేలో తలపడనుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా, ఆస్ట్రేలియా జట్లు 1-1తో సమంగా నిలిచిన సంగతి తెలిసిందే. సిడ్నీలో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 34 పరుగులతో, అడిలైడ్‌తో జరిగిన రెండో వన్డేలో టీమిండియా 6 వికెట్లతో గెలిచాయి. ఆస్ట్రేలియా గడ్డపై టీమిండియా ఇప్పటి వరకు ద్వైపాక్షిక సిరీస్ గెలవలేదు. 1985లో వరల్డ్ చాంపియన్‌షిప్, 2008లో సిబి సిరీస్‌లలో మాత్రమే టీమిండియా టైటిళ్లు గెలిచింది. నిజానికి ఆస్ట్రేలియాలో టీమిండియాకిది రెండో ద్వైపాక్షిక సిరీస్. 2016 ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా 1-4త ఓలమిపాలైంది. మెల్‌బోర్న్ వన్డేలో టీమిండియా గెలిస్తే 2018-19 పర్యటనల్లో ఒక్క అన్ని సిరీస్‌లు గెలిచిన జట్టుగా కోహ్లీ సేన నిలుస్తుంది. ఇంతకుముందు 1-1తో టీ20 సిరీస్‌ను డ్రా చేసుకున్న టీమిండియా 2-1తో టెస్టు సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. మూడో వన్డేలోనూ అదే గెలుపు జోరును టీమిండియా కొనసాగించనుంది. అయితే ఐదో బౌలర్ ఆప్షన్ టీమిండియాను కలవరపెడుతోంది. ఈ సిరీస్‌లో సీనియర్ పేసర్లు భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ స్ఫూర్తిదాయక బౌలింగ్‌ను ప్రదర్శించారు. ఇక ఇద్దరు ఎడమ చేతి బౌలర్లు కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా మిడిల్ ఓవర్లలో ప్రత్యర్థులను కట్టడి చేస్తూ వికట్లు సాధించారు. జట్టుకు హార్దిక్ పాండ్య దూరం కావడంతో తొలి రెండు వన్డేల్లో ఫుల్ టైమ్ బౌలర్‌ను ఉపయోగించింది. ఖలీల్ అహ్మద్ (0-55), మహ్మద్ సిరాజ్ (0-76) తమ ఏకైక మ్యాచ్‌లో ఆకట్టుకోవడంలో విఫలమయ్యారు. తొలి రెండు వన్డేల్లో ఆడిన బ్యాటింగ్ లైనప్‌తోనే చివరి మ్యాచ్‌లోనూ బరిలోకి దిగాలని టీమిండియా భావించడం కీలకంగా మారింది. మరోసారి అంబటి రాయుడుతో బౌలింగ్ చేయించాలని కోహ్లీ భావించడం లేదు. దీంతో ఐదుగురు బౌలర్లతోనే ప్రత్యర్థిపై అటాక్ చేయనున్నాడు.



సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ విజయ్ శంకర్, లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ కూడా తుది జట్టులో చోటుకు పోటీ పడుతున్నారు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో వీరిద్దరూ తీవ్ర కసరత్తులు చేశారు. శంకర్ ద్వారా మూడో సీమ్ బౌలింగ్ ఆప్షన్‌గా, అదనపు బ్యాట్స్‌మన్‌గా జట్టుకు ఉపయోగపడనున్నాడు. అయితే అరంగేట్ర వన్డేలో శంకర్ పది ఓవర్లు వేయగలడా అనే చర్చ టీమ్ మేనేజ్‌మెంట్‌లో జరుగుతోంది. సిరాజ్ కూడా ఇదే విధంగా ఇబ్బంది పడుతున్నాడు. చివరి మూడు ఓవర్లలో అతని బౌలింగ్ విధానానికి కోహ్లీ ఆశ్చర్యపోయాడు. అయితే ఈ మ్యాచ్‌లో ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని టీమిండియా భావిస్తే చాహల్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అతి పెద్ద మైదానమైన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో (ఎంసీజీ) కొత్త బంతితో సైనా 10 ఓవర్లు పొదుపైన బౌలింగ్, అటాకింగ్ సత్తా వంటి సామర్థ్యం కారణాలు చాహల్‌కు ఫేవర్‌గా నిలవనున్నాయి.

ఒకవేళ శంకర్‌ను అరంగేట్ర వన్డే ఆడించాలని కోహ్లీ భావిస్తే బ్యాటింగ్ లైనప్‌లో గందరగోళం ఏర్పడుతుంది. దీంతో కేదార్ జాదవ్‌కు అవకాశం లభిస్తుంది. దీంతో ఐదో బౌలర్ 10 ఓవర్లను జాదవ్, శంకర్‌కు పంచాల్సి వస్తుంది. అదే జరిగితే అంబటి రాయుడు లేదా దినేష్ కార్తీక్‌లలో ఎవరో ఒకరు తమ స్థానాన్ని త్యాగం చేయాల్సి వస్తుంది. రెండో వన్డేలో కార్తిక్ అందరినీ ఆకట్టుకున్నాడు. కాగా రాయుడు తొందరపడ్డాడు. అయితే నాలుగో నంబర్ బ్యాట్స్‌మెన్‌ను ఎంపిక చేయడంలో టీమిండియా కెప్టెన్ కాస్త కఠినమైన నిర్ణయమే తీసుకోవాల్సి ఉంటుంది. గురువారం ప్రాక్టీస్ చేసిన కొద్ది మంది భారత క్రికెటర్లలో రాయుడు కూడా ఉన్నాడు. శంకర్, చాహల్, జాదవ్, మహేంద్ర సింగ్ ధోనీ, శిఖర్ ధావన్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నారు.

మరోవైపు పేసర్ జాసన్ బెహ్రెన్‌డార్ఫ్ గొంతు నొప్పితో బాధపడుతుండటం ఆస్ట్రేలియా జట్టును కలవరపెడుతున్న అంశం. కెప్టెన్ ఆరోన్ ఫించ్ చెప్పిన దాని ప్రకారం బిల్లీ స్టాన్‌లేక్ తుది జట్టులో చోటు సంపాదించాడు. గత రెండు వన్డేల్లో ఓపెనర్లు ఫించ్, అలెక్స్ క్యారే రాణించకపోవడం కూడా ఆస్ట్రేలియా జట్టుకు సమస్యగా మారింది. దీంతో మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ జట్టును గెలిపించే బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో టీమిండియాతో ఆడిన 14 మ్యాచ్‌లకు గాను 9 వన్డేల్లో ఆస్ట్రేలియా గెలిచింది. శుక్రవారం నాటి మ్యాచ్‌లో ఇది ఆస్ట్రేలియా జట్టుకు స్ఫూర్తినిచ్చే అవకాశముంది. 2017 జనవరి తర్వాత తొలిసారి వన్డే సిరీస్‌ను గెలవాలని కంగారూలు పట్టుదలగా ఉన్నారు.

టీమిండియా: విరాట్ కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, అంబటి రాయుడు, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ (వికెట్ కీపర్), కుల్‌దీప్ యాదవ్, యజ్వేంద్ర చాహల్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, విజయ్ శంకర్.

ఆస్ట్రేలియా (తుది జట్టు): ఆరోన్ ఫించ్ (కెప్టెన్), అలెక్స్ క్యారే (వికెట్ కీపర్) పీటర్ హాండ్స్‌కాంబ్, ఉస్మాన్ ఖవాజా, షాన్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, జే రిచర్డ్సన్, పీటర్ సిడ్డిల్, బిల్లీ స్టాన్‌లేక్, మార్కస్ స్టోనిస్, ఆడమ్ జంపా.

హార్దిక్ పాండ్య వల్లే జట్టులో సమతుల్యం

- టీమిండియా ఓపెనర్ ధావన్



మెల్‌బోర్న్: ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య జట్టులో చాలా కీలక ఆటగాడని టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. భారత జట్టులో సమతుల్యత రావడానికి హార్దిక్ ముఖ్య భూమిక పోషించాడన్నాడు. ఇటీవల ఓ టీవీ షోలో మహిళలపై అసభ్యకర పదజాలం చేసిన హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై బీసీసీఐ సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంలో హార్దిక్ పాండ్య గురించి ధావన్ మాట్లాడుతూ.. 'పాండ్య వచ్చిన తర్వాత జట్టులో సమతుల్యత ఏర్పడింది. భారత జట్టు బ్యాలెన్స్ కావడంలో పాండ్య కీలక పాత్ర పోషించాడు. జట్టులో చేరినప్పటి నుంచీ పాండ్య కీలక సభ్యుడిగా మారిపోయాడు' అని పేర్కొన్నాడు. మరొకవైపు పేసర్లు మహ్మద్ సిరాజ్, ఖలీల్ అహ్మద్‌లకు మద్దతు తెలిపాడు. వారిద్దరూ ఇంకా యువ క్రికెటర్లేనని, నేర్చుకునే దశలోనే ఉన్నారని చెప్పాడు. భవిష్యత్తులో వీరిద్దరూ మరింత పరిణితి సాధిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం తమ బౌలింగ్ యూనిట్‌కు ఎటువంటి భయం లేదన్నాడు.

పాండ్య, రాహుల్‌లకు మాజీ కెప్టెన్ మద్దతు

ముంబై : 'కాఫీ విత్ కరణ్' టీవీ షోలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి నిషేధం ఎదుర్కొంటున్న భారత క్రికెటర్లు పాండ్య, రాహుల్‌లకు టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మద్దతుగా నిలిచారు. తప్పుగా మాట్లాడి కుమిలిపోతున్న పాండ్య, రాహుల్‌లను మన్నించి వదిలేయాలని అన్నారు. ముంబైలో మీడియాతో మాట్లాడుతూ.. 'నిజమే..! పాండ్య, రాహుల్ మాటలు అభ్యంతరకరమైనవే. వారు మాట్లాడింది తప్పే. కానీ మనమంతా మనుషులం. యంత్రాలం కాదు. యంత్రాల మాదిరిగా మనం ముందుగానే ఫిక్స్ చేసినట్టుగా అన్నీ అనుకున్నవి అనుకుట్టుగా జరగాలని లేదు. తీవ్ర విమర్శలతో వారిని మరింత బాధించొద్దు. చేసిన తప్పును తెలుసుకుని వారు కుమిలిపోతున్నారు. మళ్లీ అలాంటి తప్పు చేయరు. వారికొక అవకాశమిద్దాం. వారిపై విమర్శలతో ఇంకా రాద్ధాంతం చేయొద్దు. మనం బతుకుదాం. ఇతరులను బతకనిద్దాం' అని అన్నారు.



కాగా మహిళలపట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లకు బీసీసీఐ షోకాజ్ నోటీసులు ఇచ్చి వారిని జట్టు నుంచి తప్పించింది. అర్ధాంతరంగా ఆస్ట్రేలియా నుంచి ఇండియాకు రప్పించింది. పాండ్య, రాహుల్‌ల విచారణ మొదలైంది. బీసీసీఐ సీఈఓ రాహుల్ జోహ్రి మంగళవారం వారితో ఫోన్‌లో మాట్లాడారు. అయితే కేవలం క్రికెటర్లు చెప్పింది మాత్రమే ఆయన విన్నారని టీవీ కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యం, ఆ వ్యాఖ్యల గురించి ఎలాంటి ప్రశ్నలు అడగలేదని సమాచారం.

ఫిబ్రవరిలో మహిళల పోరు

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత మహిళల జట్టు స్వదేశంలో ఇంగ్లాండ్‌తో మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనున్నట్లు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 22న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుండగా... మార్చి 4న టీ20 సిరీస్‌లో గౌహతి వేదికగా జరగనుంది. ' బోర్డు ఆఫ్ క్రికెట్ కంట్రోల్ ఆఫ్ ఇండియా (బీసీసీఐ), ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) భారత్‌లో ఇంగ్లాండ్ ఆడబోయే మ్యాచ్‌లను ప్రకటించింది' అని బీసీసీఐ సెక్రటరీ అమితాబ్ చౌదరీ తెలిపారు. మొత్తం మూడు వన్డేలు వాంఖడే స్టేడియంలో జరగనున్నాయి. ఫిబ్రవరి 22న తొలి వన్డే కాగా... ఫిబ్రవరి 25 రెండో వన్డే, ఫిబ్రవరి 28 మూడో వన్డే ఆడనున్నట్లు చౌదరీ పేర్కొన్నారు. అదే విధంగా మూడు టీ20 మ్యాచ్‌లు గౌహతిలోని క్రికెట్ స్టేడియంలో జరగనున్నాయి. తొలి టీ20 మార్చి4న, రెండో టీ20 మార్చి 7న, మూడో టీ20 మార్చి 9న జరగనున్నాయి.

వరల్డ్‌కప్‌కు రిషభ్ భారమే

- క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్

న్యూఢిల్లీ: ఈ ఏడాది వరల్డ్‌కప్ జట్టులో రిషబ్ పంత్‌కు చోటిస్తే అది జట్టు కూర్పుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అన్నారు. పంత్‌ను వరల్డ్‌కప్ జట్టులో చేర్చాలనుకోవడం మంచి నిర్ణయమూనప్పటికీ అది జట్టు కాంబినేషన్‌ను కాస్త గందరగోళానికి గురి చేస్తుందని చెప్పారు. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్‌లో పాల్గొనబోయే భారత క్రికెట్ జట్టులో యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్‌కు అవకాశం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఇటీవల చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్ తమ వరల్డ్ కప్ ప్రణాళికల్లో ఉన్నాడంటూ ఎంఎస్‌కే ప్రకటించారు. అయితే దీనిపై మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మాత్రం పెదవి విరిచాడు. ఇప్పటికే ఇద్దరు స్పెషలిస్టు వికెట్ కీపర్లు ఎంఎస్ ధోనీ, దినేశ్ కార్తీక్‌లు ఉండగా, మరొక స్పెషలిస్టు వికెట్ కీపరైన పంత్‌కు చోటు కల్పించడం జట్టుకు భారంగా మారుతుందన్నారు. 'రిషబ్ పంత్‌కు వరల్డ్‌కప్ జట్టులో స్థానం కల్పిస్తే ఒక బ్యాట్స్‌మన్‌ను కానీ బౌలర్ కానీ తీసేయాలి. ఇక్కడ రిషబ్ కోసం ఒక స్పెషలిస్టు బౌలర్‌ను తీయడం సబబు కాదు. దీంతో బ్యాట్స్‌మన్‌ను తీసేస్తేనే రిషబ్ స్థానాన్ని భర్తీ చేయొచ్చు. ఒకవేళ ఆల్ రౌండర్‌ను తీసేసి రిషభ్‌ను తీసుకుంటే అది జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుత సమయంలో ధోనీ, దినేశ్ కార్తీక్‌లు ఇద్దరూ బాగానే ఆడుతున్నారు. వీరిద్దరూ స్పెషలిస్టు వికెట్ కీపర్లే. ఆసీస్‌తో జరిగిన రెండో వన్డేలో వీరి పాత్ర వెలకట్టలేనిది. వారి అనుభవంతో కీలకమైన భాగస్వామ్యాన్ని నమోదు చేసి మ్యాచ్‌ను గెలిపించారు. ధోనీ తొలుత కొన్ని బంతుల్ని వేస్ట్ చేస్తూ ఉంటాడు. పిచ్‌పై అవగాహనకు వచ్చే క్రమంలో ధోనీ కొన్ని డాట్ బాల్స్ ఆడటానికి ఇష్టపడతాడు. ఒక్కసారి గాడిలో పడితే అతను ఏమి చేయాలనుకున్నాడో అది ఖచ్చితంగా చేసి చూపెడతాడు. గేమ్‌ను ఫినిష్ చేసే విధానంలో ధోనీ స్టైలే వేరు. ఇక దినేశ్ కార్తీక్ కూడా మంచి బ్యాట్స్‌మన్. మ్యాచ్‌పై ఒత్తిడిని తగ్గిస్తూ స్ట్రైక్ రొటేట్ చేయడంలో కార్తీక్‌కు అనుభవం ఉంది. ఇటువంటప్పుడు వరల్డ్‌కప్ జట్టుకు రిషభ్ ఎంపిక అనేది సరైనది కాకపోవచ్చు' అని సచిన్ పేర్కొన్నారు.



క్వార్టర్స్‌లో సైనా, శ్రీకాంత్

- మలేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



కౌలాలంపూర్: భారత టాప్ షట్లర్లు సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్ మలేషియా ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. గురువారమిక్కడ జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సైనా హాంకాంగ్‌కు చెందిన పుయి యిన్ యిప్‌పై ఘనవిజయం సాధించింది. 39 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో సైనాలో యిప్‌పై 21-14, 21-16తో గెలుపొంది క్వార్టర్స్‌కు చేరుకుంది. సైనా క్వార్టర్స్‌లో జపాన్‌కు చెందిన నొజొమి ఒకుహరతో పోటీపడనుంది. ఇక పురుషుల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్ విభాగంలో శ్రీకాంత్ హాంకాంగ్‌కు చెందిన వాంగ్ వింగ్ విన్‌సెంట్‌పై గెలుపొందాడు. ఈ పోరులో శ్రీకాంత్ 23-21, 8-21, 21-18తో విన్‌సెంట్‌పై విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. తొలి రౌండ్‌లో 23-21తో గెలుపొందిన శ్రీకాంత్... రెండో రౌండ్‌లో విన్‌సెంట్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. రెండో రౌండ్‌లో విన్‌సెంట్ 21-8తో శ్రీకాంత్‌పై విజయం సాధించాడు. దీంతో నిర్ణయాత్మక చివరి మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-18తో ప్రత్యర్థిపై గెలుపొంది సెట్‌తో పాటు మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకున్నాడు. క్వార్టర్స్‌లో శ్రీకాంత్ కొరియాకు చెందిన సన్ వాన్ హోతో పోటీపడనున్నాడు. ఇక్కడ జరిగిన మరో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో పారుపల్లి కశ్యప్ 17-21, 23-25తో ఇండోనేషియాకు చెందిన ఆంటోనీ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి వైదొలిగాడు. ఇక మహిళల డబుల్స్ విభాగంలో అశ్విని పొన్నప్ప- సిక్కిరెడ్డి జోడి 18-21, 17-21తో ఇండోనేషియా జంటపై ఓడిపోయారు.

మూడో రౌండ్‌లో సెరెనా, హాలెప్

- ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: టెన్నిస్ దిగ్గజాలు సెరెనా విలియమ్స్ (అమెరికా), సిమోన్ హాలెప్ (రోమేనియా) ఆస్ట్రేలియా ఓపెన్‌లో ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ హాలెప్, 16వ సీడ్ సెరెనా, స్విటోలినా (ఉక్రెయిన్) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇక పురుషుల సింగిల్స్‌లో నిషికొరి మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. మహిళల సింగిల్స్‌లో గురువారం జరిగిన రెండో రౌండ్‌లో సెరెనా విలియమ్స్ 6-2, 6-2తో కెనడాకు చెందిన బౌచార్డ్‌పై అలవోక విజయం సాధించగా... హాలెప్ అమెరికాకు చెందిన సోఫియా కెనిన్‌పై 6-3, 6 (5)-7 (7), 6-4తో చెమటోడ్చి విజయం సాధించి మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. ఇక స్విటోలినా 6-4, 6-1తో కుజ్‌మోవాపై విజయం సాధించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో జరిగిన రెండో రౌండ్‌లో నిషికొరి (జపాన్) 6-3, 7(8)-6(6), 5-7, 5-7, 7(10)- 6(7)తో కార్లోవిక్‌కు షాక్ ఇచ్చాడు. ఇక్కడ జరిగిన మరో మ్యాచ్‌లో డొమినిక్ థీమ్‌కు షాక్ తగిలింది. థీమ్ 7-5, 6-4, 2-0తో పాపీరిన్ చేతిలో ఓడిపోయి టోర్నీ నుంచి వైదొలిగాడు. నిషికొరితోపాటు జ్వెరెవ్ కూడా మూడో రౌండ్‌కు చేరాడు. జ్వెరెవ్ 7(7)-6(5), 6-4, 5-7, 6(6)-7(8), 6-1తో చార్డీని ఓడించగా... హార్‌బర్ట్ 6-2, 1-6, 6-2, 6-4తో చుంగ్‌పై విజయం సాధించాడు. ఇక మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఒసాకా, వీనస్ విలియమ్స్, ప్లీస్కోవాలు కూడా మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ప్లీస్కోవా 4-6, 6-1, 6-0తో బ్రెంజిల్‌పై విజయం సాధించగా... వీనస్ విలియమ్స్ 6-3, 4-6, 6-0తో కార్‌నెట్‌పై గెలుపొందింది. ఒసాకా 6-2, 6-4తో జిదాన్‌సెక్‌ను ఓడించింది.

కివీస్ వన్డే జట్టు ఖరారు

- 23 నుంచి టీమిండియాతో సిరీస్

నాపియెర్ (న్యూజిలాండ్): టీమిండియాతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు గాను మూడు వన్డేలకు న్యూజిలాండ్ జట్టును ఖరారు చేశారు. కేన్ విలియమ్సన్ నేతృత్వంలోని 14 మంది సభ్యుల జట్టు ఎంపికైంది. జిమ్మీ నీషమ్, టిమ్ సీఫెర్ట్‌లకు జట్టులో చోటు దక్కలేదు. ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌కు కూడా వీరిద్దరూ దూరమయ్యారు. ఈ ఏడాది జరగనున్న వరల్డ్ కప్‌కు బ్యాటింగ్, బౌలింగ్ లైనప్‌లను ఏర్పాటు చేసుకునే భాగంగా మిచెల్ సాంట్నర్, టామ్ లాథమ్, కొలిన్ డి గ్రాండ్‌హోమ్‌లకు కూడా జట్టులో చోటు లభించింది. శ్రీలంకతో సిరీస్‌కు లాథమ్, గ్రాండ్‌హోమ్‌లకు విశ్రాంతినిచ్చారు. మోకాలి గాయానికి శస్త్ర చికిత్స కారణంగా గత 10 నెలలుగా సాంట్నర్ వన్డేలు ఆడలేదు. అయితే గత శుక్రవారం శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో ఆడాడు. స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌గా సీఫెర్ట్ స్థానంలో లాథమ్‌కు చోటు కల్పించారు. కాగా జిమ్మీ నీషమ్ స్థానంలో గ్రాండ్‌హోమ్ జట్టులోకి వచ్చాడు. శ్రీలంకతో మూడో వన్డే నుంచి నీషమ్ గ్రేడ్ వన్ స్నాయువు నొప్పితో బాధపడుతున్నాడు. దీంతో కనీసం టీమిండియాతో జరిగే మూడు వన్డేలకు అతను దూరంగా ఉంటాడు.



ఇండియా, న్యూజిలాండ్ వన్డే సిరీస్ షెడ్యూల్

తేది	మ్యాచ్	వేదిక
జనవరి 23	తొలి వన్డే	నాపియెర్
జనవరి 26	రెండో వన్డే	బే ఓవల్
జనవరి 28	మూడో వన్డే	బే ఓవల్
జనవరి 31	నాల్గో వన్డే	సెడ్డన్ పార్క్
ఫిబ్రవరి 3	ఐదో వన్డే	వెస్ట్‌ప్యాక్ స్టేడియం

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com